ఈనాడు అమరావతి
కృష్ణా

ఆదివారం సెప్టెంబరు 29, 2024 | 5



నిన్ను సూత్తే ఎట్లో ఉన్నాది.. గుండె గట్టిగ కొట్టేసుకున్నాది!

"నిన్ను చూడబుద్దె తాంది రాజీగో.. మాటాడ బుద్దయి తాంది రాజీగో.. చేయి పట్టబుద్దాయితాంది రాజీగో.. ముద్దు పెట్టబుద్దాయితాంది రాజీగో.. అని చిరునగవులతో.. చిలిపి చూపులతో.." నటి శ్రీలీల కుర్రకారు మదిని గిలిగింతలు పెట్టింది. విజయవాడ నగరంలో ఓ ప్రముఖ వస్త్ర దుకాణం ప్రారంభానికి విచ్చేసిన సొగసిరి.. అభిమానులకు కనువిందు చేసింది.

- ఈనాడు, అమరావతి

చేనేత ప్రదర్శనలతో మరింత వైభవం

లబ్బీపేట(విజయవాడ సిటీ): చేనేత కార్మికులు తయారు చేసిన ఉత్పత్తులను విక్రయించుకునేలా రాష్ట్ర వ్యాప్తంగా ప్రదర్శనలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర బీసీ సంక్షేమం, చేనేత శాఖ మంత్రి సవిత అన్నారు. క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఎంజీ రోడ్డులోని పీవీపీ స్క్వేర్ మాల్‌లో చేనేత బజార్‌ను శనివారం ఆమె ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ.. కొన్నేళ్ల నుంచి చేనేత వృత్తి చేసుకుంటున్న కార్మికుల అభ్యున్నతికి ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో చేనేత, జౌళి శాఖ కమిషనర్ రేఖా రాణి, క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ ఏపీ ప్రతినిధులు రంజన, సుజాత తదితరులు పాల్గొన్నారు. స్టాల్స్‌ను పరిశీలించినప్పుడు అందంగా ఆకర్షణీయంగా ఉన్న పూసల దండను మంత్రి వేసుకున్నారు. చీరలు కొనుగోలు చేశారు.



ఆకర్షణీయంగా ఉందంటూ పూసల దండను చూపిస్తున్న మంత్రి సవిత

మున్సిపల్ ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్



మాట్లాడుతున్న డీఈవో తాహెరాసుల్తానా

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే : విజయవాడ, మచిలీపట్నం నగర పాలకసంస్థలతో పాటు గుడివాడ పురపాలక సంఘ పరిధిలోని స్కూల్ అసిస్టెంట్ తెలుగు, హిందీ ఉపాధ్యాయులకు శనివారం మచిలీపట్నంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం ఉద్యోగోన్నతులు, రివర్షన్‌కు సంబంధించి కౌన్సెలింగ్ చేయాల్సి ఉంది. రివర్షన్‌కు సంబంధించి ఉపాధ్యాయులు సమయానికి హాజరు కాకపోవడంతో ఆలస్యంగా కౌన్సెలింగ్ నిర్వహించారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలోని పురపాలక సంఘాల పరిధిలో 19 మంది స్కూల్ అసిస్టెంట్లు(తెలుగు), ఐదుగురు స్కూల్ అసిస్టెంట్ల(హిందీ)కు ఉద్యోగోన్నతులు కల్పించి డీఈవో చేతులమీదుగా ఉత్తర్వులు అందజేశారు. విద్యాశాఖ ఏడీ అజీజ్, సూపరింటెండెంట్ పవన్ కుమార్, సూరిబాబు, రామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మ ఉత్సవం.. అంగరంగ వైభవంగా!





కడియం నుంచి తెచ్చిన పచ్చని మొక్కలతో ఆహ్లాదంగా ఆలయ ప్రాంగణం

ఈనాడు డిజిటల్, అమరావతి: విజయవాడ దుర్గామల్లేశ్వర్ల దేవస్థానంలో దసరా ఉత్సవాలకు అధికారులు ముందస్తుగా ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు. ప్రకాశం బ్యారేజీలో నీరు అధికంగా ఉండటంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జల్లు స్నానాలు కల్పించనున్నారు. సీతమ్మవారి పాదాలు దగ్గర కేశఖండనశాల, దుర్గాఘాట్, పద్మావతి ఘాట్‌ల వద్ద భక్తులు జల్లు స్నానాలు చేసేందుకు, హైదరాబాద్ నుంచి వచ్చే భక్తుల కోసం పున్నమి ఘాట్ వద్ద 700 షవర్లు ఏర్పాటు చేస్తున్నారు. భక్తుల స్నానాలకు తగ్గట్లుగా ఘాట్‌లన్నీ ఇప్పటికే శుభ్రం చేశారు. కొండ దిగువన ఉన్న వినాయక ఆలయం నుంచి రెండు కిలోమీటర్ల భక్తులు క్యూలు నడిచి.. ఘాట్‌రోడ్డు మీదుగా అమ్మవారిని దర్శించుకుని తిరిగి శివాలయం మెట్ల మార్గం గుండా దిగేలా ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతోపాటు ఈ సారి ప్రత్యేక ఆకర్షణగా పచ్చదనంతో నిండేలా రాజమహేంద్రవరంలోని కడియం నర్సరీ నుంచి వివిధ ఆకృతుల్లో ఉండే మొక్కలు తీసుకొచ్చారు. ఘాట్‌రోడ్డు, భక్తులు ఆలయంలోకి ప్రవేశించే ప్రధాన ద్వారం, మీడియా పాయింట్ ఇలా అన్నిచోట్లా ఈ మొక్కలు పెట్టనున్నారు. ప్రధాన ఆలయం, గోపురం, చుట్టూ ఉన్న ఉపాలయాలు, గోడలకు రంగులు వేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు 5 క్యూలైన్లు ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులకు కొండ దిగిన తర్వాత.. అన్నదానం, ప్రసాద కౌంటర్లు ఏర్పాటు చేశారు. దుర్గాఘాట్‌లోనే ఈసారి నవహారతులు నిర్వహించనున్నారు.



కృష్ణవేణి ఘాట్‌లో జల్లు స్నానాల కోసం ఏర్పాట్లు



అర్జున వీధిలో ప్రసాదం కౌంటర్లు సిద్ధం



వంద రోజుల్లో 1.5 లక్షల గృహాలు నిర్మిస్తాం



మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి

కూచిపూడి: ప్రతి పేదవాడికి సొంతిల్లు ఉండాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టిందని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. మొవ్వ క్షేత్రయ్య కల్యాణ మండపం ఆవరణలో మన ఇల్లు - మన గౌరవం పేరిట లబ్ధిదారులకు శనివారం అవగాహన కల్పించారు. ఇప్పటికి 40 వేల ఇళ్ల నిర్మాణం పూర్తి చేశామనీ.. మరో వంద రోజుల్లో 1.5 లక్షల గృహాల నిర్మాణమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం గృహ నిర్మాణాల కోసం అందించిన రూ.19వేల కోట్లలో రూ.4,500 కోట్లు గత వైకాపా ప్రభుత్వం ఎందుకు ఖర్చు చేసిందో తెలియదన్నారు. గత అయిదేళ్లలో అభివృద్ధిని పక్కన పెట్టి హింసా రాజకీయాలు చేశారన్నారు. రెచ్చగొట్టే రాజకీయాలు చేసే నాయకులకు ఎలా బుద్ధి చెప్పాలో కూటమి ప్రభుత్వానికి తెలుసన్నారు. కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసుకోవాలని సూచించారు. గృహనిర్మాణ సంస్థ ఎండీ రాజాబాబు మాట్లాడుతూ త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు. పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా మాట్లాడుతూ ఇది ప్రజాప్రభుత్వం, పేదవాడి ప్రభుత్వమన్నారు. గృహనిర్మాణ శాఖ ఎస్ఈ నాగభూషణం, పీడీ ఎస్.వెంకట్రావు, ప్రత్యేక అధికారి రాములునాయక్ తదితరులు పాల్గొన్నారు.

వడివడిగా అడుగులు!

20 శాతం పూర్తయిన పోర్టు పనులు

న్యూస్‌టుడే- మచిలీపట్నం రూరల్, కోనేరుసెంటర్



బాచింగ్ ప్లాంట్

కృష్ణా జిల్లా ప్రజల చిరకాల స్వప్నమైన బందరు పోర్టు నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. గత అనుభవాల దృష్ట్యా పోర్టు విషయంలో అనేక సందేహాలున్నా కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక ప్రత్యేక దృష్టి సారించి నిరంతర సమీక్షలతో దిశా నిర్దేశం చేస్తున్న నేపథ్యంలో ప్రజల్లో పోర్టుపై ఆశలు చిగురిస్తున్నాయి. ఇటీవల పోర్టు నిర్మాణంపై మంత్రి రవీంద్ర, ఎంపీ బాలశౌరి అధికారులతో నిర్వహించిన సమీక్షలో దాదాపు 20 శాతానికి పైగా పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. నిర్దేశిత గడువు లోపు పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

వాటర్ బ్రేక్ నిర్మాణం తొలి దశ పూర్తి



పోటెత్తే సముద్రపు అలలు పోర్టు నిర్వహణ పరమైన కార్యకలాపాలకు ఇబ్బందులు సృష్టించకుండా ఉండేందుకు కీలకమైన వాటర్ బ్రేక్ నిర్మాణ పనులను తొలి దశగా చేపట్టారు. సౌత్ వాటర్ బ్రేక్ వాల్ 2705 మీటర్లు, నార్త్ వాటర్ బ్రేక్ వాల్ 250 మీటర్ల నిర్మాణాలు (కోర్ లేయర్) ఇప్పటికే పూర్తి అయ్యాయి. దీని కారణంగా డ్రెడ్జింగ్ జరిగే ప్రాంతంలో ఎటువంటి అలలు లేకుండా సముద్రం సరస్సులా గోచరిస్తుంది. వాటర్‌బ్రేక్ వాల్‌కు సంబంధించి రెండో దశ లేయర్‌లో కొండరాళ్లను అమర్చాల్సి ఉంది. దీనిపై 7 టన్నుల బరువైన టెట్రాపాట్‌లను అమరుస్తారు.

* పోర్టు నిర్మాణాన్ని పర్యవేక్షించేందుకు అవసరమైన పరిపాలనా భవన పనులకు సంబంధించి రెండు అంతస్తుల వరకూ స్లాబ్ దశను పూర్తి చేసుకున్నాయి. ఓడల ద్వారా వచ్చే సరకును నిల్వ చేసేందుకు 4 భారీ గోడౌన్లను నిర్మిస్తున్నారు. ప్రస్తుతం అవి పునాదుల దశలో నిర్మాణంలో ఉన్నాయి.

పునాదుల దశకు బెర్తులు..

కీలకమైన బెర్తుల నిర్మాణం పునాదుల దశకు చేరుకుంది. 64 మీటర్ల లోతు నుంచి పిల్లర్ల నిర్మాణం చేపట్టగా ఇపుడు పునాదుల వరకు వచ్చింది. ఒక్కొక్క బెర్తును 300 మీటర్ల పొడవుతో తూర్పు ముఖంగా రెండు, పడమర ముఖంగా రెండు నిర్మిస్తున్నారు. నాలుగు బెర్తులకు మధ్యలో ఓడలు వచ్చి నిలుస్తాయి. ఏడాది వ్యవధిలో బెర్తుల నిర్మాణం పూర్తి చేసే దిశగా ప్రణాళికలు సిద్ధం చేశారు.

డ్రెడ్జింగ్ పనులు 4.34 శాతం..




పూడిక తీస్తున్న డ్రెడ్జింగ్ యంత్రాలు

బెర్త్‌ల వద్దకు ఓడలు వచ్చేందుకు కాలువ తవ్వకం పనులు చేపట్టారు. 46 మిలియన్ క్యూబిక్ మీటర్ల మట్టిని తవ్వి ఇతర ప్రాంతాలకు తరలించాల్సి ఉండగా ఇప్పటికి 2 మిలియన్‌లకు పైగా క్యూబిక్ మీటర్ల మట్టిని తొలగించారు. రోజుకు 30వేల క్యూబిక్ మీటర్ల మట్టిని 5 డ్రెడ్జింగ్ యంత్రాలు తవ్వుతున్నాయి. కాలువ లోతు మైనస్ 17 మీటర్ల వరకు తవ్వాల్సి ఉంటుంది. కాలువ లోతు మైనస్ 7 మీటర్లకు చేరుకుంటే కానీ భారీ డ్రెడ్జర్లు ఇక్కడకు చేరలేవు. మరో మూడు నెలల్లో కావాల్సిన లోతుకు తవ్వి అపుడు భారీ యంత్రాలతో తవ్వేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. భారీ డ్రెడ్జర్లను విదేశాల నుంచి తెప్పించేందుకు నిర్మాణ రంగ సంస్థ మేఘా సంప్రదింపులు జరుపుతోంది. తవ్విన మట్టిని పైపుల ద్వారా మరో ప్రాంతానికి తరలిస్తున్నారు.

* పోర్టుకు అనుసంధానంగా రోడ్, రైల్వే ట్రాక్ ఏర్పాటు కోసం చర్యలు వేగవంతం చేశారు. మచిలీపట్నం- పెడన రోడ్డులో పోతేపల్లి మీదుగా బీచ్ రోడ్డులోని ఇంజినీరింగ్ కాలేజీ సమీపం నుంచి పోర్టు వరకు రైల్వేలైను నిర్మాణం కావాల్సి ఉంది. దీని నిమిత్తం పోతేపల్లి, పోతిరెడ్డిపాలెం గ్రామాల పరిధిలో రైతుల నుంచి కొంతమేర భూములు సేకరించారు. ఇంకా అవసరమైన భూములను సేకరించే విషయంపై కలెక్టర్ బాలాజీ ప్రత్యేక దృష్టి పెట్టారు.

నిర్దేశిత గడువు లోగా...


* గుత్తేదారు సంస్థ నిర్దేశిత గడువు ప్రకారం 2025 అక్టోబరు నాటికి నాలుగు బెర్త్‌లతో కూడిన తొలి దశ పోర్టు నిర్మాణం పూర్తి చేయాల్సి ఉంది. మలి దశలో మరో 16 బెర్తులు నిర్మించాల్సి ఉంటుంది. పోర్టు పనుల పురోగతిపై అధికారులు ఎప్పటికప్పుడు కేంద్ర ప్రభుత్వానికి, ఏపీ మారిటైం బోర్డుకు నివేదికలను అందజేస్తున్నారు. సీఎం చంద్రబాబు పోర్టు అంశాన్ని తరచూ సమీక్షిస్తున్న నేపథ్యంలో పనులు వేగవంతం చేసే దిశగా మంత్రి రవీంద్ర, ఎంపీ బాలశౌరి ఎప్పటికప్పుడు పురోగతిని ఆరా తీస్తున్నారు. మొత్తం మీద పనులు ఇదే వేగంతో జరిగితే 2025 చివరకు ప్రజల చిరకాల వాంఛ సాక్షాత్కారం అయ్యే అవకాశాలు ఉన్నాయి.



ఆకాశమే హద్దుగా పర్యాటకుల కోలాహలం

రామోజీ ఫిల్మ్‌సిటీలో సందడే సందడి

రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: పండగల వేళ పర్యాటకుల రాకతో రామోజీ ఫిల్మ్‌సిటీ సందడిగా మారింది. దసరా, దీపావళి పండగలను పురస్కరించుకుని ఈ నెల 26న ప్రారంభమైన వేడుకల్లో నిత్యం ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఫిల్మ్‌సిటీ సందర్శనకు వచ్చి మ్యూజికల్ గ్లో గార్డెన్ అందాలను వీక్షిస్తూ ముగ్ధులవుతున్నారు. ఫిల్మీ స్ట్రీట్ విశేషాలు ఆబాలగోపాలాన్ని ఆకట్టుకుంటున్నాయి. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు వేడుకల్లో పాలుపంచుకుంటూ చిన్నా, పెద్ద ఉల్లాసంగా గడుపుతున్నారు.





సరదాసరదా కార్యక్రమాలు, వినోదం పంచే ఏర్పాట్లు ప్రతి ఒక్కరినీ ఆనందతీరాలకు చేర్చుతున్నాయి. లైవ్ షోలు మధురానుభూతిని పంచుతున్నాయి. సాయంత్రం వేళల్లో సంతోషాలను ఆస్వాదించాలనుకునే పర్యాటకులు మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి వచ్చి ఆనందిస్తున్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీని సరికొత్త విద్యుద్దీప కాంతుల్లో కళ్లారా వీక్షించి



రవాణా సౌకర్యం.. రామోజీ ఫిల్మ్‌సిటీలో పండగ సంబరాలకు విచ్చేసే పర్యాటకులకు హైదరాబాద్ నగరంలోని వివిధ ఎంపిక చేసిన ప్రాంతాల నుంచి పికప్, డ్రాపింగ్ సౌకర్యం కల్పిస్తున్నారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా వేడుకలను ఆస్వాదించేందుకు వచ్చే వారికి ఇది ఎంతగానో దోహదపడుతుంది.

మధుర జ్ఞాపకాలను పదిలం చేసుకుంటున్నారు. స్టూడియో టూర్‌తో ఫిల్మ్‌సిటీని చుట్టేస్తూ సినీజగత్తులో విహారాన్ని ఆస్వాదిస్తున్నారు. రాజసం ఉట్టిపడేలా సాగే కార్నివాల్ పరేడ్, సంభ్రమాశ్చర్యాలను కళ్లముందుకు తెచ్చే మోషన్ క్యాప్చర్, వర్చువల్ షూట్ ఇలా.. అనుక్షణం ఆనంద వీక్షణాలతో పండగల వేళ చిన్నాపెద్దా ఆనందిస్తున్నారు. ఇంకెందుకు ఆలస్యం.. మీరూ రామోజీ ఫిల్మ్‌సిటీ సంబరాల్లో పాలుపంచుకోవచ్చు పదండి.

మరిన్ని వివరాలకు..
www.ramojifilmcity.com ఫోన్ నంబర్ 76598 76598ను సంప్రదించవచ్చు.

జగన్‌రెడ్డీ రాజకీయాలు చాలించు



మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం(కోనేరుసెంటరు), న్యూస్‌టుడే: తిరుమల విషయంలో జగన్‌రెడ్డి చేస్తున్న నిస్సిగ్గు రాజకీయాలు చాలిస్తే మేలని గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొనేందుకు శనివారం మచిలీపట్నం వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉద్దేశపూర్వకంగా తిరుమలలో హైందవ సంప్రదాయాలను మంట కలుపుతూ రాక్షసానందం పొందింది చాలక చివరకు పవిత్రమైన స్వామివారి ప్రసాదం విషయంలోనూ క్షమించరాని నేరానికి పాల్పడ్డారన్నారు. ఆధారాలతో సహా వెలుగు చూడటంతో కనీస పశ్చాత్తాపం లేకుండా అసత్య ప్రచారాలతో ఎదురుదాడికి జగన్‌రెడ్డి, ఆయన సైకో బ్యాచ్ దిగడం హేయమన్నారు. తిరుమల వెళ్తానంటూ రాజకీయ డ్రామా ఆడి, ఎక్కడ ప్రజాగ్రహానికి గురికావాల్సి వస్తుందోనన్న భయంతో తోక ముడిచి.. ప్రభుత్వం తనను అడ్డుకుందంటూ పనికిమాలిన ప్రచారం చేయడానికి జగన్‌కు నోరు ఎలా వచ్చిందంటూ మండిపడ్డారు. మాజీ మంత్రి పేర్ని నాని తన రాజకీయ ఉనికి కోసం ఇష్టానుసారం వ్యక్తిగత విమర్శలకు తెగబడుతున్నారని, ముందు తన వ్యక్తిత్వం గురించి ఆలోచించుకుని నోరు తెరిస్తే మేలంటూ హితవు పలికారు. తప్పుడు కేసులతో ఎవరు ఎవరిని ఇబ్బందులు పెట్టారో గుర్తుచేసుకుని బుద్ధిగా వ్యవహరిస్తే మంచిదన్నారు. పేర్ని అక్రమాలన్నింటిని ఆధారాలతో బయటపెట్టబోతున్నట్లు చెప్పారు.

సమాజ మార్పు కోరుకున్న మహాకవి జాషువా



చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

అవనిగడ్డ, న్యూస్‌టుడే: మహా కవి గుర్రం జాషువా సమాజంలో మార్పు కోరుకున్నారని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చెప్పారు. జాషువా జయంతి సందర్భంగా ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగు సాహితీ లోకంలో ఉన్నత స్థాయికి చేరుకున్న కవి జాషువా అని కొనియాడారు. తన రచనల ద్వారా కుల వివక్షతపై పోరాటం చేశారన్నారు. ఆయన రచనలకు భారత ప్రభుత్వం ద్వారా పద్మభూషణ్ పురస్కారం, కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు, ఆంధ్ర విశ్వవిద్యాలయం ద్వారా కళాప్రపూర్ణ పురస్కారం వరించాయన్నారు. తెదేపా సీనియర్ నాయకుడు పరుచూరి సుభాష్‌చంద్రబోస్, జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, దివిసీమ లలిత కళా సమితి కార్యదర్శి కె.చంద్రశేఖర్, కూటమి నాయకులు బండే రాఘవ, కర్రా సుధాకర్, శోభిల ఏడుకొండలు, యలవర్తి ఆది తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థుల ప్రగతి పత్రాలు సిద్ధం

పెడన గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలోని ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న ఇంటర్ విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డులు సిద్ధమయ్యాయి. వాటిని ఉమ్మడి కృష్ణా జిల్లా పరిధిలోని 25 ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు పంపనున్నారు. ఇప్పటికే ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 1, 2 యూనిట్ పరీక్షలు పూర్తయ్యాయి. దసరా సెలవుల అనంతరం అక్టోబర్ 15 నుంచి త్రైమాసిక పరీక్షలు నిర్వహిస్తారు. ఈ పరీక్షలు పూర్తి కాగానే అధ్యాపకులు జవాబు పత్రాలను మూల్యాంకనం చేసి మార్కుల్ని ప్రోగ్రెస్ కార్డుల్లో నమోదు చేయాల్సి ఉంటుంది. అనంతరం తల్లిదండ్రుల సమావేశాలు ఏర్పాటు చేసి విద్యార్థుల ప్రగతి, హాజరు గురించి అధ్యాపకులు వివరించనున్నారు. ఆర్ఐఓ సీఎస్ఎస్ఎన్ రెడ్డి మాట్లాడుతూ ప్రోగ్రెస్ కార్డులు సిద్ధంగా ఉన్నాయన్నారు. సోమవారం కళాశాలలకు పంపుతామని తెలిపారు.

వైకాపాకు కార్పొరేటర్ రాజీనామా



అనుచరులతో కార్పొరేటర్ రోజా దంపతులు

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ 44వ డివిజన్ కార్పొరేటర్ నరహరిశెట్టి రోజా వైకాపాకు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. శనివారం డివిజన్‌లో ఆమె తన భర్త అజయ్‌కుమార్‌తో కలిసి అనుచరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్పొరేటర్‌గా డివిజన్ పరిధిలోని అనేక సమస్యలను నాయకుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. దీంతో వైకాపాకు రాజీనామా చేసి డివిజన్ అభివృద్ధికి కృషి చేయాలని నిర్ణయించుకున్నామన్నారు. ఇందులో భాగంగానే రాజీనామా లేఖను పార్టీ రాష్ట్ర కార్యాలయానికి స్పీడ్ పోస్టు ద్వారా పంపించామన్నారు. తమతోపాటు వందల సంఖ్యలో కార్యకర్తలు పార్టీ వీడనున్నారని, వారితో మరోసారి చర్చించి ఏ పార్టీలో చేరబోయేది వెల్లడిస్తామన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -121 రిటైల్ ధర 143 చికెన్ విత్ స్కిన్ - 207, చికెన్ స్కిన్‌లెస్ - 236. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 137, 148 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 595 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.84/-.

'సహకార సంఘాన్ని నిర్వీర్యం చేశారు'



మాట్లాడుతున్న శ్రీనివాసరావు, పక్కన సీఈవో శ్యామనోహర్

హనుమాన్ జంక్షన్, న్యూస్‌టుడే: గత ప్రభుత్వ హయాంలో వేలేరులోని చెన్నకేశవ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని నిర్వీర్యం చేయడంతో పాటు, ఆర్థికంగా నష్టపర్చారంటూ రైతులు, గ్రామస్థులు మండిపడ్డారు. రెండు గ్రామాలకు సంబంధించిన ఈ సంఘంలో అయిదేళ్లలో ఒక్కసారి కూడా సర్వసభ్య సమావేశం నిర్వహించలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం కేడీసీసీ బ్యాంకు సీఈవో శ్యామనోహర్ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి వేములపల్లి శ్రీనివాసరావు పలు అవకతవకలను వెలుగులోకి తెచ్చారు. రూ.40 లక్షల నిధులు దుర్వినియోగం చేస్తూ నిబంధనలకు విరుద్ధంగా చిన్నమల్లమ్మకుంటలో గోదాము నిర్మించారన్నారు. ఇది చట్ట విరుద్ధం కావడంతో గ్రామ తెదేపా నాయకుడు అవిర్నేని భవానీశంకర్ హైకోర్టుకు వెళ్లి స్టే ఉత్తర్వులు తెచ్చారని తెలిపారు. అయినా కూడా గుత్తేదారు బిల్లులు డ్రా చేసుకునేందుకు ప్రయత్నించారని, దీనికి సంబంధించి ఎలాంటి బిల్లులు మంజూరు చేయవద్దంటూ సీఈవోకు విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ సహకార సంఘం తరపున రూ.67 లక్షలు ఆదాయ పన్ను చెల్లించారని, దీన్ని వెనక్కి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఎరువుల అవసరం, తగిన వసతి ఉన్నా కూడా గత అయిదేళ్లలో బస్తా ఎరువు కూడా రైతులకు అందుబాటులో ఉంచలేదని, ఇకపై ఆ సమస్య లేకుండా చూడాలని కోరారు. సంఘం తరపున డిపాజిట్లు, రుణాలు, ఇతరత్రా లావాదేవీలు పెంచే వెసులుబాటు ఉన్నా గత పాలకులు పట్టించుకోలేదంటూ దుయ్యబట్టారు. నిబంధనల ప్రకారమే వ్యవహరిస్తామని, గోదాముకు బిల్లులు చెల్లించమని, ఎరువుల లభ్యత ఉండేలా చర్యలు తీసుకుంటామని సీఈవో హామీ ఇచ్చారు. కోడూరు వెంకట కృష్ణారావు, తుమ్మల అంజిబాబు, కలపాల రాధాకృష్ణ, కాజా సురేష్, అంగడాల సీతారామయ్య, దోనవల్లి రామారావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థూల ఆదాయ ఉత్పత్తి పెంపుపై దృష్టి

కలెక్టరేట్(మచిలీపట్నం), న్యూస్‌టుడే: జిల్లాలో స్థూల ఆదాయ ఉత్పత్తి(జీడీపీ)ని గణనీయంగా పెంచుకునే అవకాశాలపై అందరూ దృష్టి సారించాలని కలెక్టర్ డీకే బాలాజీ పేర్కొన్నారు. జడ్పీ కన్వెన్షన్ హాల్‌లో శనివారం స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్ తయారీపై వివిధ రంగాల ప్రతినిధులతో నిర్వహించిన కార్యశాలలో ఆయన ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం వికసిత్ భారత్-2047 కార్యక్రమం ద్వారా సమగ్రాభివృద్ధి సాధించి దేశాన్ని ప్రపంచంలో మూడు అగ్రగామి శక్తుల్లో ఒకటిగా నిలపాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకుందన్నారు. అందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణాంధ్ర-2047 కార్యక్రమాన్ని తలపెట్టి రాష్ట్రాభివృద్ధి కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తోందన్నారు. జిల్లాకు సంబంధించి అన్ని రకాల ఆర్థిక ఉత్పత్తుల విలువ కనీసం 15 శాతం పెంచే విధంగా దార్శనిక పత్రం రూపొందించేందుకు అందరూ తమ వంతు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

అభిప్రాయాలు వ్యక్తం చేసిన వివిధ రంగాల ప్రతినిధులు.. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి కార్యశాలకు హాజరైన ఆయా రంగాల ప్రతినిధులు మిక్కిలినేని మధు, పామర్తి నాగేశ్వరరావు, ఆనంద్, టార్జన్‌రావు, వీరసింహుడు, చంద్రమౌళి, భావన్నారాయణ, మాలెంపాటి కాంచనరావు, డా. సత్యప్రసాద్, కనకదుర్గ, బీవీ సుబ్బారావు, అజయ్ ఘోష్, తదితరులు తమ అభిప్రాయాలు, అవసరాలను వివరించారు. ★ వ్యవసాయ యాంత్రీకరణకు పెద్దపీట వేసి వివిధ రకాల యంత్రాలు, డ్రోన్‌లను రాయితీపై రైతులకు అందజేయాలని కోరారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించే క్రమంలో చిరుధాన్యాలను సరఫరా చేయాలని, కాల్వల పరంగా ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని సూచించారు. ★ కలంకారీకి సంబంధించి అధునాతన ఆకృతులపై శిక్షణ, ముడి సరకును రాయితీపై ఇవ్వడం వల్ల మెరుగైన ఫలితం ఉంటుందన్నారు. ★ పసుపు, అరటి, మిరప పంట ఉత్పత్తుల నుంచి చిప్స్, పొడులు, ఇతర ఉత్పత్తుల తయారీ కోసం ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు అవసరం ఉందన్నారు. ★ ఆక్వా కల్చర్‌కు క్లస్టర్ల ఏర్పాటుతో పాటు బయోఫ్లాక్ విధానంలో ఫీడ్ తయారీని ప్రోత్సహించాలన్నారు. పడిపోతున్న పౌల్ట్రీ ఉత్పత్తులను దృష్టిలో ఉంచుకుని తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.

★ సముద్రంలో మత్స్య సంపద పట్టేందుకు అవసరమైన శాస్త్ర సాంకేతిక సౌలభ్యాలు, మార్కెటింగ్‌ను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఏ పరిశ్రమకు ఏ నైపుణ్యం అవసరమో గుర్తించి ఆ దిశగా నిరుద్యోగ యువతకు శిక్షణ ఇవ్వాలన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, పరిశ్రమల నిర్వాహకులు, రైతులు, చేనేత సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కౌలుదారులకే నష్టపరిహారం ఇవ్వండి

ఉంగుటూరులో ఏపీ కౌలురైతు సంఘ నాయకులు ఆందోళన



ఏపీ రైతు, కౌలురైతు సంఘ నాయకులు, రైతుల నిరసన


ఉంగుటూరు (గన్నవరం గ్రామీణం), న్యూస్‌టుడే: ఇటీవల వరదలతో ఉంగుటూరు మండలంలో భారీ నష్టం జరిగింది.. కౌలు రైతులకే నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని ఏపీ రైతు సంఘ రాష్ట్ర నాయకులు వై.కేశవరావు డిమాండ్ చేశారు. ఉంగుటూరులో ప్రభుత్వ నిబంధనలను సడలించి ప్రతిఒక్క రైతును ఆదుకోవాలని ఏపీ రైతు, కౌలురైతు సంఘం ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. సంఘ రాష్ట్ర నాయకులు కేశవరావు మాట్లాడుతూ.. జిల్లా, మండలస్థాయి అధికారులు గ్రామాల్లో పర్యటించి వరదల వల్ల జరిగిన నష్టాన్ని సక్రమంగా అంచనా వేయాలన్నారు. నేటికీ పొలాల్లో నీరు అలానే ఉందన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన రూ.పదివేల పరిహారం ఏమూలకు రాదని.. రైతు పెట్టిన పెట్టుబడికి అనుగుణంగా రూ.25వేలు తగ్గకుండా పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కౌలు రైతుసంఘం ప్రధాన కార్యదర్శి హరిబాబు మాట్లాడుతూ.. దేశంలో అంబానీ లాంటి వాళ్లకు రూ.కోట్లు రుణమాఫీ చేసిన కేంద్రం.. అన్నం పెట్టె రైతు ఆపదలో ఉంటే ఆదుకోవాల్సిన బాధ్యత లేదా అన్నారు. రైతులతో పాటు, ముంపునకు గురైన లంకపల్లి, ముక్కపాడు, ఎలుకపాడు, ఓంద్రుంపాడు, ఆముదాలపల్లి గ్రామస్థులు తమకు పూర్తిస్థాయిలో వరద నష్టపరిహారం చెల్లించాలంటూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం జె.విమల కుమారికి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో కౌలు రైతుసంఘం నాయకులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా డూండీ గణపతి నిమజ్జనం



విజయవాడ లేబరు కాలనీ మైదానంలో డూండీ గణేష్ సేవా సమితి ఆధ్వర్యంలోని 72 అడుగుల భారీ మట్టి గణపతిని ప్రతిష్ఠించిన చోటే శనివారం నిమజ్జనం చేశారు. విగ్రహం లోపల అమర్చిన పైపులు, అగ్నిమాపక శకటం నీరుతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ భారీ గణనాథునికి నివేదించిన లడ్డూ రికార్డు స్థాయిలో రూ.16 లక్షలు పలికింది. కామెంటేనర్‌కు చెందిన సత్య బాలాజీ వేలంలో దీన్ని దక్కించుకున్నారు.
- న్యూస్‌టుడే, విద్యాధరపురం

వైకాపా పతనానికి గ్రాడ్యుయేట్లు నాంది పలికారు



మాణిక్యాలరావు, నారాయణరావులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

అవనిగడ్డ, న్యూస్‌టుడే: వైకాపా పతనానికి గ్రాడ్యుయేటు ఓటర్లు నాంది పలికారని లిడ్ క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యరావు అన్నారు. శనివారం సాయంత్రం ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ఆధ్వర్యంలో గాంధీక్షేత్రంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. జగన్ నీచమైన పాలన చూసి పట్టభద్రులు వారి నియోజకవర్గాల్లో వైకాపా అభ్యర్థులను ఓడించి బుద్ధి చెప్పారని విమర్శించారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న న్యాయవాది, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఏపీఎస్ ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికలలాగే శాసనమండలి ఎన్నికల్లో కూడా వైకాపాను ఓడించి, కూటమి అభ్యర్థిని గెలిపించాలని కోరారు. అనంతరం కొత్తగా నియమితులైన లిడ్ క్యాప్ ఛైర్మన్ మాణిక్యరావు, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావును ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఘనంగా సత్కరించారు.

ఆదర్శ పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి



సదస్సులో పాల్గొన్న పారిశ్రామికవేత్తలతో ఆలీప్ ప్రతినిధులు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకొని ఆదర్శ పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆలీప్ అధ్యక్షురాలు కె.రమాదేవి సూచించారు. గన్నవరం మండలం సూరంపల్లి ఎలీప్ మహిళా పారిశ్రామికవాడ ఆధ్వర్యంలో సంస్థ విజయవాడ కార్యాలయంలో జీరో డిఫెక్ట్, జీరో ఎఫెక్ట్(జడ్ఈడీ) పద్ధతులపై ఎమ్ఎస్ఎమ్ఈలకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్ఎస్ఎమ్ఈ పోటీతత్వాన్ని పెంపొందించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఛాంపియన్లుగా మార్చేందుకు దోహదపడుతుందని ఆన్‌లైను వేదికగా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవగాహన కల్పించారు. ఎమ్ఎస్ఎమ్ఈ జడ్ఈడీ సర్టిఫికేషన్ కంచు, రజత, పసిడి మూడు స్థాయిల్లో ఉంటుందంటూ పాల్గొన్న 40మంది పారిశ్రామికవేత్తలకు ఆయా పద్ధతులను ఆలీప్ రీజనల్ అధికారి వి.సునీత వివరించారు.

సకాలంలో పింఛన్లు పంపిణీ చేయండి



కలెక్టరేట్ నుంచి అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ బాలాజీ

కలెక్టరేట్(మచిలీపట్నం), న్యూస్‌టుడే: సకాలంలో సజావుగా అక్టోబరు నెల పింఛన్ల పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డీకే బాలాజీ క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి శనివారం మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, వివిధ శాఖల అధికారులతో పింఛన్లు, స్వచ్ఛతా హీ సేవ, ఈ-పంట నమోదు తదితర అంశాలను సమీక్షించి పలు సూచనలు చేశారు. పింఛన్ల పంపిణీకి రూట్‌మ్యాప్ సిద్ధం చేసుకుని నూరుశాతం లక్ష్యం సాధించాలన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా సఫాయిమిత్ర, పారిశుద్ధ్య కార్మికులకు ఆరోగ్య పరీక్షలను అక్టోబరు రెండో తేదీ లోపు పూర్తిచేయాలన్నారు. ఈ పంట నమోదు 65 శాతం మాత్రమే పూర్తయిందని, రబీలో రెండు రోజుల్లో నూరు శాతం పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

ఫ్రీహోల్డ్ భూముల పరిశీలన పూర్తి చేస్తాం.. జిల్లాలోని ఫ్రీ హోల్డ్ భూముల పరిశీలన కార్యక్రమం పూర్తి చేయనున్నట్లు కలెక్టర్ బాలాజీ సీసీఎల్ఏ ముఖ్య కార్యదర్శి జయలక్ష్మికి తెలిపారు. శనివారం ఆమె నిర్వహించిన వీసీకి హాజరైన కలెక్టర్, జేసీ గీతాంజలిశర్మ జిల్లాలో పరిస్థితిని వివరించారు. తహసీల్దార్ స్థాయిలో ఉన్న 682 ఎకరాల భూముల పరిశీలన పూర్తయిందని, రెండు రోజుల్లో మిగిలిన 310 ఎకరాల పరిశీలన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

మరో వివాదంలో వైకాపా సర్పంచి భర్త

గ్రామసభ రిజిస్టర్ చించి వీఏవోపై దౌర్జన్యం

మాజేరు(చల్లపల్లి), న్యూస్‌టుడే: చల్లపల్లి మండలం మాజేరు వైకాపా సర్పంచి లక్ష్మీ భర్త కళ్లేపల్లి లక్ష్మీనారాయణ మరో వివాదంలో ఇరుక్కున్నారు. ఇటీవలి మాజేరు సచివాలయంలో వీఆర్వో బ్యాగ్‌ను బయటకు విసిరేసి దౌర్జన్యం చేసిన ఘటనలో క్షమాపణలు చెప్పిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం గ్రామ వ్యవసాయ సహాయకురాలు మనీషాపై దురుసుగా ప్రవర్తించడంపై చల్లపల్లి పోలీస్ స్టేషన్‌లో సర్పంచి భర్త లక్ష్మీనారాయణపై శనివారం కేసు నమోదైంది.

గ్రామసభ రిజిస్టర్ చింపారని ఫిర్యాదు.. వరదలు, భారీ వర్షాలకు దెబ్బతిన్న పొలాలకు పంట నష్టం విషయమై ఈ నెల 26న మధ్యాహ్నం రైతులను వెంటబెట్టుకొని వచ్చి పంచాయతీ కార్యాలయంలో విధుల్లో ఉన్న తనపట్ల సర్పంచి లక్ష్మీ భర్త దురుసుగా ప్రవర్తించి దుర్భాషలాడుతూ వ్యవసాయశాఖకు సంబంధించిన గ్రామసభ మీటింగ్ రిజిస్టర్‌ను చించి విసిరేసి వెళ్లిపోయారని వీఏవో ఎస్.మనీషా చల్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మాజేరు రైతులందరికీ పంటనష్టం రాయమంటూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు చల్లపల్లి ఎస్.ఐ. పి.ఎస్.వి.సుబ్రహ్మణ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

★ సర్పంచి లక్ష్మి భర్త లక్ష్మీనారాయణ ఉద్యోగుల పట్ల అనుచితంగా వ్యవహరిస్తూ దౌర్జన్యం చేయడంపై చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్ బాబు అధికారులను కోరారు. తనే సర్పంచిగా వ్యవహరిస్తూ ఉద్యోగులపై దౌర్జన్యాలకు పాల్పడటం అవివేకమైన చర్య అని పేర్కొన్నారు. మాజేరు పంచాయతీ ఉద్యోగులకు రక్షణ కల్పించాలని జిల్లా ఉన్నతాధికారులను కోరుతున్నారు.

డైట్ విద్యార్థినుల హాస్టల్‌లో విచారణ

ఈనాడు కథనానికి స్పందన

అంగలూరు(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే: అంగలూరు జిల్లా విద్యా శిక్షణ సంస్థ(డైట్) ఆవరణలోని కళాశాల విద్యార్థినుల బీసీ హాస్టల్‌లో గురువారం రాత్రి ఆకతాయిలు హల్‌చల్ చేశారంటూ విద్యార్థినుల ఆందోళనపై శనివారం 'ఈనాడు'లో 'డైట్ కళాశాల వసతిగృహంలో అకతాయిల హల్‌చల్' శీర్షికతో కథనం వెలువడటంతో శనివారం అధికారులు స్పందించి విచారణ చేపట్టారు. బీసీ సంక్షేమశాఖ సహాయ సంక్షేమాధికారిణి కె.గురవమ్మ, ఎస్ఐ సత్యనారాయణ, ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ వసతిగృహంలో విద్యార్థినులను విచారించారు. వారు చెప్పిన అంశాలు, వారి భయాలు, ఆందోళనలను గుర్తించారు. వసతిగృహాన్ని, పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. తీసుకోవాల్సిన భద్రతాచర్యలపై సూచనలు చేశారు. మరిన్ని సీసీ కెమెరాలు బిగించాలని, రాత్రి కాపలాదారుని ఏర్పాటు చేసుకోవాలని, ఇతరులు లోనికి రాకుండా గోడలు నిర్మించాలని స్పష్టం చేశారు.

మచిలీపట్నం
•మచిలీపట్నం •పెడన

బెయిల్.. రాజ్యాంగం కల్పించిన హక్కు


సదస్సులో మాట్లాడుతున్న జిల్లా జడ్జి అరుణసారిక తదితరులు

మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే : బెయిల్ అనేది రాజ్యాంగం కల్పించిన హక్కు అని జిల్లా జడ్జి అరుణ సారిక అన్నారు. శనివారం ఆమె జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కేవీఆర్ కృష్ణయ్యతో కలిసి మచిలీపట్నంలోని ఉపకారాగారాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె జైల్లో వసతులపై ఆరా తీశారు. ఏదైనా సమస్య ఉంటే న్యాయసేవాధికారసంస్థ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. జైల్లో ఉండేవారికి కూడా హక్కులు ఉంటాయని వాటిని వినియోగించుకోవాలన్నారు. వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. న్యాయమూర్తి కేవీఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ న్యాయవాదిని నియమించుకునే స్తోమత లేనివారి కోసం ఉచితంగా న్యాయ సహాయం అందిస్తున్నందున సద్వినియోగం చేసుకోవాలన్నారు. లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాది బీవీ మునయ్య, జైలు సూపరింటెండెంట్ పిల్లా రమేష్, డిప్యూటీ జైలర్ బొత్స అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

లడ్డూ కల్తీకి కారణమైన వారిని శిక్షించాలి


దీక్షా శిబిరం వద్ద మాట్లాడుతున్న స్థైర్యానందస్వామి


నేలకొండపల్లి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న జనసేన నేతలు

మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే : తిరుమల లడ్డూలో కల్తీకి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని హిందూ, ధార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడడాన్ని నిరసిస్తూ శనివారం బందరు హిందూ బంధువుల ఆధ్వర్యంలో కోనేరు సెంటరులో నిరాహార దీక్ష చేపట్టారు. స్థైర్యానందస్వామి దీక్షా శిబిరం వద్ద ఏర్పాటు చేసిన వెంకటేశ్వరస్వామి చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ పక్షాల నాయకులు, భజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. మాగంటి అనీల్, మాదిరెడ్డి విజయ్ తదితరులు పర్యవేక్షించారు.

పెడన గ్రామీణం, పెడన, న్యూస్‌టుడే: జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఇచ్చిన పిలుపు మేరకు నేలకొండపల్లి అభయ ఆంజనేయస్వామి దేవాలయంలో శనివారం ప్రాయశ్చిత్త పూజలు నిర్వహించారు. తిరుమల లడ్డూ తయారీలో అపవిత్రం జరిగిందన్న కారణంగా ఆలయాన్ని శుద్ధి చేసి పూజలు చేశారు. జనసేన రాష్ట్ర నాయకులు దాసరి సత్యనారాయణ, మండల అధ్యక్షుడు ఊచా వెంకయ్య, రామకృష్ణ, కిరణ్, గ్రామస్థులు పాల్గొన్నారు. కృత్తివెన్ను చిన గొల్లపాలెంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో జనసేన నియోజకవర్గ కన్వీనర్ పంచకర్ల సురేష్ ప్రత్యేక పూజలు చేశారు.

పరిశుభ్రత పాటిద్దాం.. ఆదర్శంగా నిలుద్దాం

పెడన, న్యూస్‌టుడే : ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటిస్తూ ఆదర్శంగా నిలవాలని మున్సిపల్ కమిషనర్ మన్నం గోపాలరావు అన్నారు. స్వచ్ఛతా హీ సేవలో భాగంగా శనివారం 23వ వార్డులో ప్రదర్శన చేపట్టారు. ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు అవగాహన కల్పించారు. కౌన్సిలర్లు కటకం ప్రసాద్, ఉమ్మిటి తనూజ, నేతలు ఉమ్మిటి శ్రీనివాసరావు, యక్కల శ్యామలయ్య తదితరులు పాల్గొన్నారు.


ప్రదర్శనలో అధికారులు, ప్రజాప్రతినిధులు

పట్టణ ఆరోగ్య కేంద్రాలకు సుస్తీ

పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందని వైనం

కొన్ని చోట్ల అలంకారం.. అస్తవ్యస్తం

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే

ప్రజలకు అందుబాటులోనే మెరుగైన వైద్యసేవలు అందించాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేసిన పట్టణ ఆరోగ్య కేంద్రాలను వైకాపా ప్రభుత్వం పట్టించుకోక పోవడంతో అలంకారంగా మారిపోయాయి. కేంద్రాలున్నా ప్రజలు సర్వజన ఆసుపత్రి, లేదంటే ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతంలో నగరంలో పలు చోట్ల నిర్మించిన ఆరోగ్య కేంద్ర భవనాలను కూడా పూర్తి చేయకపోవడంతో, అసంపూర్తిగా వదిలేసిన భవనాల్లో అవసరమైన సేవలు అందక రోగులు ఇబ్బంది పడుతున్నారు.

ప్రారంభం కాకుండానే పాడైపోతున్న భవనం

నగరంలోని చిలకలపూడి, నారాయణపురం, వర్రెగూడెం, శారదానగర్, బందరుకోట, రైలుపేట ప్రాంతాల్లో పట్టణ ఆరోగ్యకేంద్రాలు ఉన్నాయి. వర్రెగూడెం, చిలకలపూడి కేంద్రాలకు మాత్రమే ఇటీవల వరకు భవనాలు ఉన్నాయి. వైకాపా హయాంలో రైలుపేట, శారదానగర్‌లలో నూతన భవన నిర్మాణాలు చేపట్టినా ఇప్పటికీ పూర్తిస్థాయిలో వినియోగంలోకి రాని పరిస్థితి. రైలుపేట కేంద్రానికి నిర్మిస్తున్న భవన నిర్మాణం చివరి దశలో ఆగిపోయింది. ప్రస్తుతం భవనం అధ్వానంగా తయారైంది. సిమెంటు రాలిపోతుండటం నాణ్యతలేమికి నిదర్శనమని స్థానికులు విమర్శిస్తున్నారు.


భవనంలో పెచ్చులూడిపోతున్న దృశ్యం


ప్రారంభం కాకుండానే పాడైపోతున్న రైలుపేట భవనం


పూర్తిస్థాయి వసతులు కల్పించకుండానే ప్రారంభించిన శారదానగర్ ఆరోగ్య కేంద్రం

★ శారదానగర్‌లో కేంద్రాన్ని పనులు పూర్తి కాకుండానే హడావుడిగా ప్రారంభించారు. ల్యాబ్ నిర్మాణం అసంపూర్తిగా ఉండటంతో అక్కడ పరీక్షలు నిర్వహించడానికి అవకాశం లేకుండా పోయింది. మరుగుదొడ్లు నిర్మించినా నీటి సరఫరా లేదు. దీంతో వైద్యులు, సిబ్బంది తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ సమస్యను కౌన్సిల్ సమావేశంలో కూడా తెదేపా సభ్యులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. అయినా స్పందించిన దాఖలాలు లేవు.

★ బందరుకోటలో చేపట్టిన భవనం అసంపూర్తిగానే మిగిలిపోయింది. కొన్ని కేంద్రాలకు భవనాలు లేక, ఉన్న భవనాలు ఉపయోగ పడక రోగులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

★ భవనాలు పూర్తి కాకపోవడంతో కొన్ని కేంద్రాలు అద్దె గదుల్లో సాగుతుంటే పూర్తయిన చోట వసతులు లేవు. ఫలితంగా రోగులకు అందించే సేవలపై ప్రభావం పడుతోంది. శారదానగర్ కేంద్రంలో నిర్మించిన ల్యాబ్ అసంపూర్తిగా వదిలేయడంతో పరికరాలన్నీ మూలన పడి ఉన్నాయి. కొన్ని చోట్ల వివిధ రకాల పరీక్షలు చేసేందుకు పరికరాలు, సిబ్బంది ఉన్నా కేవలం భవనం లేకపోవడంతో ఉపయోగం లేకుండా తయారయ్యాయి.

★ నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న కేంద్రాల వారీగా చూస్తే ఒక్కొ దానిలో రోజుకు సగటున 30 నుంచి 40 మంది చొప్పున ఓపీ నమోదవుతోంది. వాటిలో సాధారణ వైద్య సేవలతోపాటు టెలీ మెడిసిన్ సేవలు కూడా అందుబాటులో ఉన్నాయి. ఈ సమస్యలపై మంత్రి రవీంద్ర ఇటీవల అధికారులతో సమీక్షించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో కూటమి ప్రభుత్వ హయాంలో అయినా పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో తిష్ట వేసిన సమస్యలు పరిష్కారం అవుతాయని ఆయా ప్రాంతాల ప్రజలు ఆశతో ఎదురు చూస్తున్నారు.

హామీతో నిరసన విరమణ

మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే : అకారణంగా విధుల నుంచి తొలగించిన ఫణీంద్ర అనే కార్మికుడిని తక్షణం విధుల్లోకి తీసుకోవాలంటూ మచిలీపట్నం సర్వజన ఆసుపత్రి వద్ద కార్మికులు చేపట్టిన నిరసన శనివారం కూడా కొనసాగింది. దీనిపై కాంట్రాక్టర్ వచ్చి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు మోదుమూడి రామారావు, ఓఎల్‌రావు, బూర సుబ్రహ్మణ్యం తదితరులు వారికి మద్దతు పలికారు. సాయంత్రం ఆ నాయకులతోపాటు ఆసుపత్రి ఆర్‌ఎంవో నిరంజన్‌కుమార్ తదితరులు కార్మికులతో సంప్రదింపులు చేశారు. కార్మికుల డిమాండ్‌లకు సానుకూలంగా స్పందించడంతో నిరసన విరమిస్తున్నట్లు వెల్లడించారు.

సవాళ్లను అధిగమిస్తేనే భవిత

కృష్ణావిశ్వవిద్యాలయం(మచిలీపట్నం), న్యూస్‌టుడే : విద్యార్థులు తమ హక్కులతోపాటు బాధ్యతలు కూడా గుర్తించి దానికి అనుగుణంగా నడుచుకోవాలని కృష్ణా విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆర్. శ్రీనివాసరావు అన్నారు. విప్లవ వీరుడు భగత్‌సింగ్ జయంతి ఏఐఎస్‌ఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం విశ్వవిద్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపకులపతితో పాటు రిజిస్ట్రార్ శోభన్‌బాబు మాట్లాడుతూ యువత ముందు అనేక సవాళ్లున్నాయని వాటిని అధిగమించి ముందుకుసాగితేనే భవిత అన్నారు. నాయకులు ఎం.సాయికుమార్, రంజిత్, జగదీష్, సూరజ్, యువరాజ్ తదితరులు పాల్గొని భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పించారు.



నివాళులు అర్పిస్తున్న ఉపకులపతి, రిజిస్ట్రార్ తదితరులు

మచిలీపట్నం(కోనేరుసెంటరు): భగత్‌సింగ్ జయంతి సందర్భంగా నవ జవాన్ భారత్ సభ(ఎన్‌బీఎస్) దిశ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు శనివారం ఆంధ్రా జాతీయ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో బహుమతులు ప్రదానం చేశారు. ఎన్‌బీఎస్ సభ్యులు చోనాష్, జయప్రకాష్, శంకరానంద్ వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

బంటుమిల్లి: బంటుమిల్లి డిగ్రీ కళాశాలలో శనివారం భగత్‌సింగ్ జయంతి వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపల్ ఎస్. జగన్‌మోహనరావు, చరిత్రశాఖ అధిపతి జి.సుజాత జి.బి. ఆనంద్‌కుమార్, ఆర్.హేమామాలినిదేవి, కె.సత్య, రాజేష్ తదితరులు పాల్గొన్నారు. పలురకాల ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

క్షీరబంధు చెక్కు అందజేత

పెడన, న్యూస్‌టుడే: చేవేంద్రకు చెందిన పాడి రైతు కోన తులసీ మోహనరావు ఇటీవల మృతిచెందారు. ఆయన కృష్ణామిల్క్ యూనియన్‌లో సభ్యుడిగా ఉన్న నేపథ్యంలో యూనియన్ అమలు చేస్తున్న క్షీరబంధు పథకం కింద మంజూరైన రూ.50వేలను చెక్కు రూపంలో తులసీ మోహనరావు కుటుంబ సభ్యులకు యూనియన్ డైరెక్టర్ అర్జా వెంకట నగేష్ శనివారం అందజేశారు. గుడ్లవల్లేరు చిల్లింగ్ కేంద్రం మేనేజర్ తోట నాగేశ్వరరావు, పాలకేంద్రం అధ్యక్షుడు నల్లమోతు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం

మచిలీపట్నం(కోనేరుసెంటరు), న్యూస్‌టుడే : అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. స్థానిక రైల్‌పేటలో శనివారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. వైకాపా ఐదేళ్ల పాలనతో ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజలు కూటమి ప్రభుత్వ 100 రోజుల పాలనతో స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకుంటూ సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. మున్సిపల్ మాజీ ఛైర్మన్ బాబాప్రసాద్, ఇలియాస్‌పాషా, వెంకన్న, శ్రీరాములు, స్థానిక నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.


వృద్ధురాలితో ఆనందం పంచుకుంటున్న మంత్రి రవీంద్ర

☛ వరద బాధితులకు సాయం అందించేందుకు ముందుకు వచ్చిన ఎల్‌ఐసీ ఉద్యోగ సంఘ నాయకులను మంత్రి అభినందించారు. ఎల్‌ఐసీ ఎంప్లాయిస్ సంఘ ఆధ్వర్యాన వరద బాధితులకు పంపేందుకు సిద్ధం చేసిన నిత్యావసర సరకులతో కూడిన వాహనానికి మంత్రి పచ్చజెండా ఊపారు. సంఘ ప్రతినిధి వేము కోటేశ్వరరావు మాట్లాడుతూ 300 మంది వరద బాధితులకు ఒక్కొక్కటి రూ.3వేల విలువ చేసే వంట పాత్రలు, దుస్తులు, నిత్యావసర వస్తువులతో కూడిన కిట్లు అందజేస్తున్నట్లు చెప్పారు. సంఘ నాయకులు కిశోర్‌కుమార్, ఇతర బాధ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

కలంకారీకి ఉజ్వల భవిష్యత్తు

పెడన, న్యూస్‌టుడే: భారతదేశ ఆర్థిక ప్రగతికి కలంకారీ పరిశ్రమ తోడ్పాటునందిస్తుందని అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు పేర్కొన్నారు. కళాశాలకు చెందిన డిగ్రీ ఎకనమిక్స్, హిస్టరీ చివరి సంవత్సర విద్యార్థులు శనివారం పెడనలోని కలంకారీ పరిశ్రమను సందర్శించారు. కలంకారీ హస్తకళలు రూపుదిద్దుకునే ప్రక్రియను పరిశీలించారు. కళాశాల ప్రిన్సిపల్ డా.డి.ఉమారాణి, అధ్యాపకులు ఏ.వీరకుమారి, రాజ్యలక్ష్మి, రవి తదితరులు పాల్గొన్నారు. హస్తకళల ప్రగతికి విశేష కృషి చేస్తూ జాతీయ అవార్డులు పొందిన సోదరులు కొండ్రు గంగాధర్, నరసయ్యలను విద్యార్థులు కలిసి అభినందించారు.


జాతీయ అవార్డు గ్రహీతలు గంగాధర్, నరసయ్యతో అధ్యాపకులు, విద్యార్థులు

ఉత్తమ క్యాడెట్‌గా ఎంపిక

కృష్ణావిశ్వవిద్యాలయం (మచిలీపట్నం), న్యూస్‌టుడే : 16వ ఆంధ్రా బెటాలియన్ తరపున సికింద్రాబాదులో నిర్వహించిన ఎన్‌సీసీ శిక్షణ శిబిరంలో కృష్ణా విశ్వవిద్యాలయానికి చెందిన ఎస్.ప్రణీత్‌సాయి ఉత్తమ క్యాడెట్ బహుమతి అందుకున్నారు. ప్రతిభ చాటిన విద్యార్థిని ఉపకులపతి ఆర్.శ్రీనివాసరావు, ఎన్‌సీసీ అధికారి డి.రామశేఖరరెడ్డి, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆర్.విజయకుమారి తదితరులు అభినందనలు తెలిపారు.


విద్యార్థిని అభినందిస్తున్న ఉపకులపతి, తదితరులు

‘తిరుమల ప్రసాదంపై రాజకీయాలా?’

మచిలీపట్నం(కోనేరుసెంటరు), పెడన, న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి చంద్రబాబు ఏడు పదుల వయసులో ఏం ఆశించి దేవదేవుడైన తిరుమలేశుని అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేస్తున్నారో అర్థం కావడం లేదని మాజీ మంత్రి, వైకాపా జిల్లా అధ్యక్షుడు పేర్ని వెంకట్రామయ్య(నాని) అన్నారు. తిరుమల ప్రసాద కల్తీ ఘటనకు సంబంధించి పార్టీ పిలుపు మేరకు శనివారం స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వివిధ సమస్యలతో ప్రజలు, సాగునీరు లేక రైతులు, సంక్షేమ అందక ఇతర వర్గాలు సతమతమవుతుంటే వారి గోడు పట్టించుకోకుండా తిరుమల ప్రసాద రాజకీయాలతో కాలం నెట్టుకురావడం మానుకోవాలంటూ కూటమి ప్రభుత్వ నాయకులకు సూచించారు. తిరుమల ప్రసాదంలో కల్తీ జరిగిందని ప్రభుత్వం చేస్తోన్న ప్రచారం అవాస్తవమని వైకాపా పెడన నియోజకవర్గ కన్వీనర్ ఉప్పాల రాము అన్నారు. స్థానిక శ్యామలానగర్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నేతలు ప్రత్యేక పూజలు చేశారు.

విద్యుత్తు ఏఈగా ఏడుకొండలరావు

పెడన,: విద్యుత్తు శాఖ పెడన సెక్షన్ ఏఈగా పి.ఏడుకొండలరావు శనివారం బాధ్యతలు చేపట్టారు. పెడన ఏఈ కింజరాపు జయరాంను కృత్తివెన్నుకు బదిలీ అయ్యారు.

బీచ్ రహదారి అధ్వానం

మచిలీపట్నం నగరం నుంచి మంగినపూడి బీచ్‌కు వెళ్లే రహదారి గుంతలతో ప్రమాదకరంగా మారింది. పోతిరెడ్డిపాలెం, సిరివెళ్ళపాలెం, తాళ్ళపాలెం గ్రామాల్లో రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొత్తగా ఈ మార్గంలో వచ్చేవారు అవగాహన లేక ప్రమాదాలకు గురవుతున్నారు. రహదారికి తక్షణం మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

- మచిలీపట్నం రూరల్, న్యూస్‌టుడే


పోతిరెడ్డిపాలెం రోడ్డు వద్ద గుంతలమయం


తాళ్ళపాలెం హైస్కూల్ రోడ్ వద్ద గుంతలు పడి


సిరివెళ్ళపాలెం వద్ద రోడ్డు దుస్థితి

ఆత్మవిశ్వాసం ఉంటే వైకల్యం అడ్డుకాదు

మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే : ఆత్మవిశ్వాసం ఉండాలే కానీ అంగవైకల్యం అడ్డు కాదని పలువురు వక్తలు పేర్కొన్నారు. ప్రపంచ బధిరుల దినోత్సవాన్ని శనివారం విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ, బధిర సంఘాల ఆధ్వర్యంలో మచిలీపట్నంలోని నోబుల్ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండి రామకృష్ణ, నోబుల్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్‌జజే ఎర్నెస్ట్, వివిధ సంఘాల నాయకులు దేవనగేష్, వై.సీతారామప్రసాదు, ఎన్.శ్రీకాంత్ మాట్లాడుతూ అందుబాటులో ఉన్న అవకాశాలు వినియోగించుకుని సాధారణ వ్యక్తులకు దీటుగా రాణించాలన్నారు. బధిర సంఘాల నాయకులు వివిధ సమస్యలు వివరించి పరిష్కరించాలని కోరారు. విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ జిల్లా సహాయ సంచాలకుడు వి.కామరాజు ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల గురించి వివరించారు. కొల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో వారికి భోజనాలు పంపిణీ చేశారు.


అతిథులు, అధికారులతో విభిన్న ప్రతిభావంతులు

నూతనంగా నిర్మించే ఇళ్లకు రూ.4 లక్షలు

పెడన గ్రామీణం, న్యూస్‌టుడే : నియోజకవర్గంలో గృహనిర్మాణ లక్ష్యాల్ని సాధించటానికి కృషి చేయాలని పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ తెలిపారు. మండలంలోని మడకలో శనివారం సాయంత్రం నిర్వహించిన మన ఇల్లు-మన గౌరవం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మడకలో 53 గృహాలు మంజూరయ్యాయని, 36 నిర్మాణాలు పూర్తి అయ్యాయని 17 గృహాల నిర్మాణాలు వేర్వేరు దశల్లో ఉన్నాయని వీటిని త్వరలో పూర్తి చేయాలని పేర్కొన్నారు. గృహనిర్మాణ శాఖ డీఈ బి.బుజ్జిబాబు, ప్రత్యేకాధికారి పద్మావతి, ఏఈ మాధవీ, ఇన్‌ఛార్జి తహసీల్దార్ అనిల్, ఎంపీడీవో వీరమల్లు రెడ్డియ్య, జడ్పీటీసీ అర్జా నగేష్, తెదేపా మండల అధ్యక్షుడు శలపాటి ప్రసాద్, గ్రామ సర్పంచి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



పెడన: మడకలో లబ్ధిదారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాగిత, తదితరులు

పెడన: పట్టణంలోని పల్లోటి-1 లేఔట్‌లో గ్రామసభను శనివారం కమిషనర్ మన్నం గోపాలరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. పట్టణంలోని మూడు లేఔట్లలో 2,232 మందికి సెంటు వంతున స్థలాలనివ్వగా 998 మంది ఇంకా పూర్తిచేయలేదని ఏఈ సత్యనారాయణ తెలిపారు.

ఎస్.ఎన్.గొల్లపాలెం(మచిలీపట్నంరూరల్), న్యూస్‌టుడే : నూతనంగా గృహ నిర్మాణం చేపట్టే వారికి మాత్రమే రూ.4 లక్షలు ప్రభుత్వం నుంచి అందుతాయని తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ తెలిపారు. మన ఇల్లు.. మన గౌరవం కార్యక్రమంలో భాగంగా శనివారం ఎస్.ఎన్.గొల్లపాలెంలో సభ నిర్వహించారు. తెదేపా మండల అధ్యక్షుడు కుంచె నాని, క్లస్టర్ ఇన్‌ఛార్జి తలారి సోమశేఖర్, కూటమి నాయకులు గళ్ళా తిమోతి, కొల్లూరి సురేష్, బొమ్మసాని నరేష్, కొనకళ్ళ మధు, అధికారులు పాల్గొన్నారు. రుద్రవరంలో గృహనిర్మాణ లబ్ధిదారులకు తెదేపా నాయకులు నీలం రమేష్, సచివాలయ సిబ్బంది అవగాహన కల్పించారు.

రేషన్ దుకాణాల తనిఖీ

పెడన, న్యూస్‌టుడే: మండలంలోని కాకర్లమూడి, బల్లిపర్రు రేషన్ దుకాణాలను మచిలీపట్నం పీడీఎస్ డీటీ సుభాన్‌బీ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్టోబరుకు సంబంధించి పంపిణీకి సిద్ధంగా ఉన్న బియ్యం, ఇతర నిత్యావసరాల వస్తువులను పరిశీలించారు. ఈ రెండు చోట్ల ఒకే డీలర్ బాధ్యతలు నిర్వహిస్తుండగా కొన్ని బియ్యం బస్తాలు పక్కదారి పట్టాయన్న సమాచారంతో ఈ దాడులు నిర్వహించారు. గత నెలలో మిగిలిన బియ్యం లేకపోవడం ఈ తనిఖీల్లో వెలుగుచూసింది. ఫిర్యాదు చేసిన వ్యక్తులు మాత్రం రెండు చోట్ల 18 బస్తాలు బ్లాక్ మార్కెట్‌కు తరలాయని పేర్కొనడంతో విచారణ జరుగుతోంది. పెడన ఆర్ఐ మణికుమార్ తదితరులు ఈ దాడుల్లో పాల్గొన్నారు.


కాకర్లమూడిలో తనిఖీలు నిర్వహిస్తోన్న పీడీఎస్ డీటీ.పక్కన ఆర్ఐ

విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయడమే లక్ష్యం

పెడన, కృత్తివెన్ను, బంటుమిల్లి, న్యూస్‌టుడే : విద్యార్థుల నుంచి ప్రతిభ వెలికితీయడమే సంస్కరణల లక్ష్యమని ఎంఈవో-1 బాలాత్రిపుర సుందరి, ఎంఈవో-2 ఎస్‌కేడీవీ ప్రసాదరావు అన్నారు. కృత్తివెన్నులోని సంగమూడి జడ్పీఉన్నత పాఠశాలలో, బంటుమిల్లిలోని ప్రభుత్వ హైస్కూల్‌లో శనివారం వివిధ స్థాయిల్లో వ్యాసరచన, వక్తృత్వ, పోటీలు నిర్వహించారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. వారిని అభినందించారు. విజేతలు జిల్లా స్థాయిలో ఈ నెల 29న నిర్వహించే పోటీలకు వెళ్తారని తెలిపారు.

సైన్సు ప్రదర్శన కొనసాగింపు

పెడన గ్రామీణం, న్యూస్‌టుడే: రీజనల్ సైన్సు సెంటర్(తిరుపతి), సీసీఎంబీ సంచార సైన్సు వాహనంలోని అంశాల్ని శనివారం విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. పట్టణ భట్ట జ్ఞాన కోటయ్య జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ వాహనాన్ని నిలిపి ఉంచారు. పెనుమల్లి, నందిగామ, చేవేంద్ర, బల్లిపర్రు పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు సందర్శించారు. బీజీకె జడ్పీ ప్రధానోపాధ్యాయిని బీబీ తీర్థావతి, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హోరా హోరీగా పోటీలు

గూడూరు, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక జడ్పీ ఉన్నతపాఠశాలలో నిర్వహిస్తున్న క్రీడల పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. శనివారం ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, షటిల్, చెస్ క్రీడల బాలికల విభాగ నియోజకవర్గస్థాయి జట్లు ఎంపిక నిర్వహించారు. పోటీల నియోజకవర్గ సమన్వయకర్త మురళీ, వ్యాయామ ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.


కబడ్డీలో తలపడుతున్న బాలికలు

ఉత్సాహంగా స్వాగత వేడుకలు

పెడన గ్రామీణం, న్యూస్‌టుడే: నందమూరు వాసవీ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం నిర్వహించిన స్వాగతోత్సవం కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. ద్వితీయ సంవత్సర విద్యార్థులు ఈ ఏడాది కొత్తగా చేరిన విద్యార్థులకు స్వాగతం పలుకుతూ ఈ వేడుక జరిపారు. కళాశాల ఛైర్మన్ జీఎం ప్రసాద్, కరస్పాండెంట్ కాకి కుమార్, కార్యదర్శి తాడేపల్లి మెహర్‌బాబా, కార్యనిర్వాహక డైరెక్టర్లు డి.బాబా, టి.సాయి కుమార్, ప్రిన్సిపల్ బీఆర్‌ఎస్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డి.రాజా రమేష్, కార్యక్రమ సమన్వయకర్త ఎన్ అనిల్ కుమార్, ఆయా విభాగాధిపతులు పాల్గొన్నారు.


విద్యార్థులు ప్రదర్శించిన నృత్యం

కొనకళ్లకు అభినందన

మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే : తెదేపా జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు ఆర్టీసీ ఛైర్మన్‌గా నియమితులైన సందర్భంగా శనివారం వివిధ ప్రాంతాలకు చెందిన నాయకులు ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి పూల దండలతో సత్కరించి అభినందనలు తెలిపారు. మాజీ ఏపీపీ లంకె వెంకటేశ్వరరావు, న్యాయవాదులు ఆకుల వెంకట్రామయ్య, తిరుమాని సత్యనారాయణ తదితరులు పుష్పగుచ్ఛం అందించారు. రాష్ట్రీయ బ్రాహ్మణసంఘటన జాతీయ అధ్యక్షుడు గోటేటి సుబ్రహ్మణ్యేశ్వరరావు, నాయకులు పీవీ ఫణికుమార్ తదితరులతోపాటు తెదేపా లీగల్‌సెల్ నాయకులు పుప్పాల ప్రసాదు, మాదివాడ వెంకటనరసింహారావు, ఆంజనేయులు, పుప్పాల వెంకట్రావులు కొనకళ్ల నారాయణరావుతోపాటు సోదరుడు జగన్నాథరావు(బుల్లయ్య)లకు అభినందనలు తెలిపారు.


నారాయణరావును సత్కరిస్తున్న తెదేపా లీగల్‌సెల్ ప్రతినిధులు

గుడివాడ
• గుడివాడ • పామర్రు • అవనిగడ్డ

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
గుడివాడ: 89775 35999 పామర్రు : 80085 74684 అవనిగడ్డ: 80085 74679

? మాంటిస్సోరి పాఠశాల పక్కన మా ఇంటి వద్ద చుట్టు పక్కల వారు చెత్త వేస్తున్నారు. పురపాలక అధికారులకు, సచివాలయ సిబ్బందికి చెప్పినా పట్టించుకోవడం లేదు.
- వీవీఎల్.రవికుమార్, శాంతినగర్

✔ సమస్య పరిష్కరిస్తాం
- సహాయ కమిషనర్, పురపాలక సంఘం, గుడివాడ

? బంటుమిల్లి రోడ్డులో చేపల మార్కెట్ వద్ద ఆదివారం ట్రాఫిక్ అధికంగా ఉంటోంది. రాకపోకలకు ఇబ్బంది కలగడంతోపాటు రోడ్డు సరిగ్గా లేక ప్రమాదాలు జరుగుతున్నాయి.
- చోరగుడి సంసోను, విశ్రాంత పోలీసు, ఇందిరానగర్ కాలనీ

✔ ఎక్కువ మంది సిబ్బందిని ఏర్పాటు చేసి సమస్య పరిష్కరిస్తాం. **- జి.ప్రసాద్, ట్రాఫిక్ ఎస్ఐ, గుడివాడ.**

? గుడివాడ రైల్వే ఫైవంతెన దిగాక రోడ్డు పక్కన వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రి వేళల్లో కుక్కలు మీదకు వస్తుండడంతో ద్విచక్రవాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు.
- కూరాళ్ల సాయిబాబు, బేతవోలు

✔ పురపాలక విద్యుత్తు విభాగం అధికారులతో మాట్లాడి తక్షణం వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం.
- ప్రవీణ్, పురపాలక సంఘం డీఈ

ఆర్డీవో బాధ్యతల స్వీకరణ

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: గుడివాడ ఆర్డీవోగా జి.బాలసుబ్రమణ్యం శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల సమయంలో ఆయన రెవెన్యూ శాఖ నుంచి పురపాలక శాఖకు డిప్యూటేషన్‌పై గుడివాడ పురపాలక కమిషనర్‌గా వచ్చారు. అనంతరం బి.శ్రీనివాస్ గుడివాడ కమిషనర్‌గా బదిలీపై రాగా బాలసుబ్రమణ్యం తన మాతృ శాఖకు వెళ్లి వెంటనే బదిలీపై ఆర్డీవోగా నియమితులయ్యారు. బాధ్యతల స్వీకరణ తరువాత బాలసుబ్రమణ్యం దంపతులు మెయిన్ రోడ్‌లోని విఘ్నేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

డిప్యూటీ తహసీల్దారు..

ఘంటసాల, న్యూస్‌టుడే: ఘంటసాల మండల డిప్యూటీ తహసీల్దారుగా బి.కనకదుర్గ శనివారం బాధ్యతలు స్వీకరించారు. గుడ్లవల్లేరు మండల డిప్యూటీ తహసీల్దారుగా విధులను నిర్వర్తిస్తూ బదిలీపై ఆమె ఘంటసాలకు వచ్చారు.

దేశ ప్రగతి మోదీతోనే సాధ్యం

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే : మారుమూల గ్రామాలకు కూడా అభివృద్ధి ఫలాలు అందాలనే లక్ష్యంతో ప్రధాని మోదీ పని చేస్తున్నారని భాజపా జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ శ్రీరాజబాబు పేర్కొన్నారు. స్థానిక టిడ్కో కాలనీకి చెందిన 30 మంది భాజపాలో చేరడంతో వారికి కండువాలు కప్పి ఆయన పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవరకొండ చిన్నా నేతృత్వంలో టిడ్కో కాలనీ వాసులు భాజపాలో చేరడం అభినందనీయమన్నారు.

జనసేనలో చేరిక : గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: జనసేన పార్టీ గుడివాడ నియోజకవర్గ బాధ్యుడు బూరగడ్డ శ్రీకాంత్ ఆధ్వర్యంలో 18వ వార్డులో జనపాల కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో 30 మంది శనివారం జనసేనలో చేరారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు వేమూరి త్రినాథ్, ప్రధాన కార్యదర్శి శాయన రాజేష్ పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా మురుగు కాల్వలు

సాగు నీరందక లబోదిబోమంటున్న అన్నదాతలు


మోపిదేవి : పెదప్రోలులో దట్టంగా అల్లుకున్న గుర్రపు డెక్క


అవనిగడ్డ మండలం రామచంద్రపురంలో ఇలా..

న్యూస్‌టుడే, అవనిగడ్డ గ్రామీణం, చల్లపల్లి

మురుగు కాల్వలు నిర్వహణకు నోచుకోక ఖరీఫ్ సాగు అన్నదాతల్ని ఇక్కట్లకు గురిచేస్తోంది. గత వైకాపా ప్రభుత్వ అయిదేళ్ల పాలనలో ఖరీఫ్‌కు ముందే పూడిక తీయడం, గుర్రపు డెక్క, తూటుకాడ తొలగించక దివిసీమలోని అవనిగడ్డ, నాగాయలంక, కోడూరు మండలాలతోపాటు మోపిదేవి మండలంలో ఈ సమస్య అధికంగా ఉంది. మురుగు పారుదల స్తంభించడంతో ఇటీవల కురిసిన భారీ వానలకు వ్యవసాయ క్షేత్రాలు తటాకాలుగా మారాయి.

★ అవనిగడ్డ మండలం రామచంద్రపురం ఆయకట్టు ప్రాంతంలోని మురుగు కాల్వల్లో గుర్రపు డెక్క, తూటుకాడ పేరుకుపోయి నీటి పారుదలకు అడ్డంకిగా మారాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వ్యవసాయక్షేత్రాలు జలమయంగా మారాయి.

★ మోపిదేవి మండలంలోని కె.కొత్తపాలెం, పెదప్రోలు, వెంకటాపురం, మోపిదేవిలోని మురుగు కాల్వలు వాననీటిని బయటకు పంపే స్థితిలో లేవని రైతులు వాపోతున్నారు.


చల్లపల్లి : మంగళాపురంలో..

★ చల్లపల్లి మండలం మంగళాపురంలో పలు డ్రెయిన్లు గుర్రపుడెక్కతో పేరుకుపోయాయి. ఇటీవల కురిసిన భారీవర్షాలకు వరిపంట పొలాలు నీటమునిగాయి. గుర్రపుడెక్క, పూడిక తొలగింపు పనులు సరిగ్గా చేయించకపోవడంతో రైతులు ఇక్కట్లు పడాల్సి వస్తోందని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్‌బాబు, రైతుసంఘ నాయకులు చంద్ర సుబ్బారావు, డొక్కు శ్రీనివాసరావు పేర్కొన్నారు.

ఆక్రమణల చెరలో హనుమంతపురం డ్రెయిన్

న్యూస్‌టుడే, మంటాడ (పమిడిముక్కల)

జలవనరుల శాఖ అధికారుల పర్యవేక్షణ కరవై హనుమంతపురం కాలువ ఏళ్ల తరబడి గుర్రపుడెక్క, తూటుకాడతో నిండి సక్రమంగా సాగునీరందక నష్టపోతున్నామని హనుమంతపురం, వనంపూడి రైతులు ఆరోపిస్తున్నారు. వీరంకిలాకు వద్ద బందరు కాలువ నుంచి ప్రారంభమైన ఈ కాలువ వంద ఎకరాలకుపైగా సాగునీరు అందించేది. గత అయిదేళ్లుగా ఆక్రమణల కారణంగా చిన్న బోదెలా మారి చివరి భూములకు నీరు అందడంలేదు. ఆక్రమణలతోపాటు నీటిపారుదలకు అడ్డంకిగా ఉన్నవాటిని తొలగించాలని ఏఈ, డీఈలకు ఎన్ని అర్జీలు పెట్టుకున్నా ఇంతవరకూ దృష్టి సారించలేదని రైతులు ఆరోపిస్తున్నారు.


కాలువలోని అడ్డంకులు తొలగించుకుంటున్న రైతులు

చర్యలు తీసుకుంటాం

గుర్రపుడెక్క, ఇతర మొక్కల నిర్మూలనకు రసాయనాలు పిచికారీ చేయించాం. అయినా ఫలితం లేకపోయింది. దీనిపై పునఃపరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం. కాలువ సర్వే విషయంపై అధికారుల దృష్టికి తీసుకెళ్తాం. **- టి.ప్రసాద్, ఏఈ, వీరంకి సెక్షన్**

కాలువ హద్దులు నిర్ణయించాలి



కాలువ చివరివరకు సకాలంలో సాగునీరు అందక ఎగువ, దిగువ రైతుల మధ్య తరచూ గొడవ పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు సర్వే చేయించి కాలువపైగల ఆక్రమణలు తొలగించి హద్దులు నిర్ణయించాలి. యంత్రం సాయంతో పూడిక తీయించాలి. **- రాజులపాటి వెంకటేశ్వరరావు, రైతు, హనుమంతపురం**

పూర్వ విద్యార్థుల దాతృత్వం ఎనలేనిది : ఎమ్మెల్యే

నిమ్మకూరు (పామర్రు గ్రామీణం), న్యూస్‌టుడే: పూర్వ విద్యార్థుల దాతృత్వం ఎనలేనిదని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. నిమ్మకూరు గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని శనివారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఈ పాఠశాలలో చదువుకున్న 1995 పదో తరగతి విద్యార్థులు రూ.1.8 లక్షలతో గ్రంథాలయం ఏర్పాటుచేయడం ముదావహమన్నారు. పూర్వవిద్యార్థి కిశోర్‌బాబు(ఐపీఎస్) రూ.2.2 లక్షలతో 21 సీసీ కెమెరాలు, సీసీ టీవీ ఏర్పాటుచేసి తన అనుబంధాన్ని చాటారన్నారు. మరో పూర్వ విద్యార్థి లింగలమనేని రాజేష్ రూ.90,500తో డైనింగ్ హాల్ ఆధునికీకరించడం అభినందనీయమన్నారు. అంతకు ముందు ఆయా సౌకర్యాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి తాడిశెట్టి నరేష్, ప్రిన్సిపల్ డి.మధుసూదనరావు, సర్పంచి పడమట శ్రీనివాసరావు, తెదేపా మండల అధ్యక్షుడు కుదురవల్లి ప్రవీణ్ చంద్ర, తెలుగు రైతు జిల్లా ఉపాధ్యక్షుడు వల్లూరుపల్లి గణేష్, పూర్వ విద్యార్థులు కాటూరి బాబు, ఖాదర్‌వలి, బజార్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.


పుస్తక ప్రదర్శన తిలకిస్తున్న ఎమ్మెల్యే, అతిథులు

నూతన మద్యం పాలసీపై 2న నిరసనలు

చల్లపల్లి, న్యూస్‌టుడే: అక్టోబరు 1 నుంచి అమల్లోకి వస్తున్న నూతన మద్యం పాలసీని సవరించాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మల్లుపెద్ది రత్నకుమారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం చల్లపల్లిలోని చంద్ర రాజేశ్వరరావు వికాస కేంద్రంలో సమావేశం నిర్వహించారు. రత్నకుమారి మాట్లాడుతూ.. నూతన మద్యం పాలసీని వ్యతిరేకిస్తూ అక్టోబరు 2న మహిళా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో అన్ని మండల కేంద్రాల్లో పెద్దఎత్తున నిరసనలు చేపట్టనున్నట్లు తెలిపారు.

గుర్రం జాషువాకు నివాళి

పామర్రు, న్యూస్‌టుడే: స్థానిక శివరామ సినీ థియేటర్ కాంప్లెక్స్ ఆవరణలో శనివారం ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గుర్రం జాషువ జయంతి నిర్వహించారు. న్యాయవాది ఆవుల ప్రవీణ్‌కుమార్ సంఘ సభ్యులతో కలిసి జాషువ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సురేంద్రకుమార్, కొల్లాబత్తుల సాల్మన్, రవికుమార్, చక్రవర్తి, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

చల్లపల్లి, న్యూస్‌టుడే: నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా జయంతిని చల్లపల్లిలో శనివారం ఘనంగా నిర్వహించారు. జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కైతేపల్లి దాస్, బుల్లా కిషోర్, సీతారామరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నేత్ర పరీక్షలు

చల్లపల్లి, న్యూస్‌టుడే: జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు పాఠశాల విద్య సమగ్ర శిక్ష, ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ సొసైటీలు సంయుక్తంగా చల్లపల్లి జడ్పీ పాఠశాలలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. చల్లపల్లి, ఘంటసాల, మోపిదేవి పాఠశాలలకు చెందిన విద్యార్థులకు తాడిగడప ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి వైద్యబృందం నేత్ర పరీక్షలు చేశారు. జిల్లా సహిత విద్యా సమన్వయకర్త ఎస్.రాంబాబు, ఎంఐఎస్ కోఆర్డినేటర్ సుభాన్, ఏపీవో ఏడుకొండలు, చల్లపల్లి ఎంఈవో-2 పి.వెంకటేశ్వరరావు, వైద్యబృందం పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు పునరుద్ధరించండి

ఘంటసాల, న్యూస్‌టుడే: ఘంటసాల మండలం శ్రీకాకుళం, పాపవినాశనం, గోగినేనిపాలెం, చినకళ్లేపల్లి, వేములపల్లి మీదుగా చల్లపల్లికి వెళ్లేందుకు విద్యార్థుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సు పునరుద్ధరించాలని తెదేపా నాయకులు కుంపటి సుబ్బారావు తెలిపారు. శనివారం ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌కు తెదేపా ఘంటసాల మండల నాయకులు తుమ్మల చౌదరిబాబు, పరుచూరి సుభాష్‌చంద్రబోస్ సమన్వయంతో వినతిపత్రాన్ని అందజేశారు. అలాగే అవనిగడ్డ ఆర్టీసీ డిపో మేనేజరు హనుమంతరావుకు కూడా వినతిపత్రాన్ని అందజేశారు.


డీఎం హనుమంతరావుకు వినతిపత్రం అందజేస్తున్న తెదేపా నాయకులు

అవనిగడ్డ, న్యూస్‌టుడే: స్థానిక శివాలయం, లంకమ్మ అమ్మవారి ఆలయంలలో అక్టోబరు 3 నుంచి ప్రారంభం కానున్న దసరా ఉత్సవాలకు సంబంధించిన ప్రచార కరపత్రాలను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆవిష్కరించారు. ఆలయ ఈవో వై.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

అవనిగడ్డ, న్యూస్‌టుడే: పంచాయతీ రాజ్ విభాగంలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ఆ శాఖ డీఈ పగడాల సురేష్‌బాబుకు సూచించారు. డీఈ కొత్తగా విధుల్లో చేరిన సందర్భంగా ఎమ్మెల్యేని మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. చల్లపల్లి, కోడూరు, ఏఈలు బి.శ్రీనివాస్, వి.విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

అవనిగడ్డ, న్యూస్‌టుడే: పేదల వైద్యానికి రాష్ట్ర ప్రభుత్వం భరోసా కల్పిస్తోందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. సీఎం సహాయనిధి నుంచి ఘంటసాల మండలం తాడేపల్లికి చెందిన గార్లపాటి రాజ్యలక్ష్మికి వైద్య ఖర్చుల కోసం విడుదలైన రూ.45 వేల చెక్కును బాధితురాలి కుమారుడు సత్యనారాయణకు ఎమ్మెల్యే అందించారు.

విద్యార్థికి ల్యాప్ ట్యాప్ అందజేత

పామర్రు, న్యూస్‌టుడే: కురుమద్దాలికి చెందిన కొసరాజు వెంకట్ ఎన్ఆర్ఐ సౌజన్యంతో అదే గ్రామానికి చెందిన విద్యార్థి వరుణ్‌కు ల్యాప్ ట్యాప్ అందించారు. శనివారం స్థానిక తెదేపా కార్యాలయంలో రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి, ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా ల్యాప్ ట్యాప్ అందజేశారు.

తహసీల్దారుకు సత్కారం

నాగాయలంక, న్యూస్‌టుడే: ఇటీవల వచ్చిన వరదలకు ప్రజలను అప్రమత్తం చేసి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నిబద్ధతతో విధులు నిర్వర్తించిన నాగాయలంక తహసీల్దారు ఎం.హరినాథ్ బాబును శనివారం తెదేపా జిల్లా మహిళా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత, జిల్లా కార్యదర్శి లకనం నాగాంజనేయులు, జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షులు ఆదినారాయణ సత్కరించారు.

ఎలక్ట్రానిక్ వ్యర్థాల తరలింపు

పమిడిముక్కల, న్యూస్‌టుడే: కలెక్టరు ఆదేశాల మేరకు పంచాయతీ, ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్న ఎలక్ట్రానిక్ వ్యర్థాలను (ఈ-వేస్ట్) జిల్లా కేంద్రానికి తరలింపు ప్రారంభించారు. ఇందులో భాగంగా శుక్రవారం చోరగుడి పంచాయతీ, పమిడిముక్కల మండల పరిషత్తు కార్యాలయాల్లోని చెడిపోయిన కంప్యూటర్లు, స్టెబిలైజర్లు, టీవీ మానిటర్లు తదితరాలను ఆటోలో మచిలీపట్నం పరిధిలోని పోతేపల్లికి తరలించినట్టు పమిడిముక్కల పంచాయతీ ఈఓ సుధాకరరావు తెలిపారు.

నష్ట పరిహారం కౌలు రైతులకే ఇవ్వాలి

గుడివాడ గ్రామీణం,న్యూస్‌టుడే: వరదలకు పంట నష్టపోవడంతో ప్రభుత్వం అందిస్తున్న పరిహారం పొల యజమానులకు కాకుండా కౌలు చేస్తున్న రైతులకే ఇవ్వాలని కౌలు రైతుల రాష్ట్ర నాయకుడు ఎం.హరిబాబు, సీపీఎం నాయకుడు ఆర్‌సీపీ రెడ్డి కోరారు. స్థానిక సుందరయ్య భవన్‌లో శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ కౌలు రైతులు బుడమేరు ప్రాంతంలో ఎకరాకు రూ.35 వేల వరకు ఖర్చు చేశారన్నారు. కానీ నష్టపరిహారం కౌలు రైతులకు కాకుండా భూయజమానులకు ఖాతాల్లో జమ కావడం దారుణమన్నారు.

అగ్నిప్రమాదంలో ఇల్లు దగ్ధం

అవురుపూడి(కూచిపూడి), న్యూస్‌టుడే: మొవ్వ మండలం అవురుపూడిలో శనివారం జరిగిన అగ్నిప్రమాదంలో తాటాకు ఇల్లు పూర్తిగా కాలిపోయి బాధితులు కట్టుబట్టలతో మిగిలారు. విద్యుత్తు షార్ట్‌సర్క్యూట్ వల్ల నాగులపాటి వీరాస్వామి ఇల్లు పూర్తిగా కాలిపోయింది. ఇంట్లోని గృహోపకరణాలతోపాటు రూ.50 వేలు(రూ.500 నోట్లు) కూడా కాలిపోయాయి. వీరాస్వామి విజయవాడలో ఉంటున్న తన కుమార్తె దగ్గరకు వెళ్లారు. ఇంటి వద్ద ఎవరూ లేని సమయంలో విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ జరగడంతో గ్యాస్‌బండ కూడా పేలి పెద్ద శబ్దం రావడంతో స్థానికులు భయపడ్డారు. పామర్రు అగ్నిమాపక కేంద్రం సిబ్బంది మంటలు అదుపు చేశారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే : యాకమూరు గ్రామం వద్ద అక్రమంగా ఇసుక లోడింగ్ చేసుకుని వస్తున్న రెండు ట్రాక్టర్లు పట్టుకున్నామని ఎస్సై అర్జునరాజు శనివారం తెలిపారు. ట్రాక్టర్లను సీజ్ చేసి డ్రైవర్లు, యజమానులపై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

కీచక పర్వంలో బాధితురాలి కుటుంబానికి బెదిరింపులు

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: చౌటపల్లి జడ్పీ పాఠశాలలో కీచక పర్వంలో కులాల రంగు పులిమి తమ కుటుంబాన్ని స్థానికులు వేధిస్తున్నారని ఐద్వా పట్టణ అధ్యక్ష కార్యదర్శులు జీఎస్.కుమారి, పి.రజిని వద్ద బాధితురాలి తల్లి వాపోయిందని సీపీఎం నాయకుడు ఆర్‌సీపీ రెడ్డి తెలిపారు. గ్రామంలో మీ కులంవారి కుటుంబం మీ ఒక్కరిదే అని.. మీరు ఏంచేస్తారో చూస్తామని బెదిరింపులకు గురిచేస్తున్నారని బాధితులు భయాందోళనలకు గురవుతున్నారన్నారు. బాధిత కుటుంబానికి పోలీసులు రక్షణ కల్పించాలని ఆయన కోరారు.

సొసైటీ మాజీ అధ్యక్షుడి మృతి

కౌతవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే: కౌతవరం సొసైటీ మాజీ అధ్యక్షుడు వడ్లమూడి నాగమోహన్(చిన్ని-50) శనివారం హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతి చెందారు. సుదీర్ఘకాలం కాంగ్రెస్ నాయకుడిగా, తర్వాత వైకాపా నాయకుడిగా వ్యవహరించిన చిన్ని సొసైటీ అధ్యక్షుడిగా చేసిన కాలంలో లాభాలబాటలో నడిపించారు. కాలేయ సమస్యతో తొలుత విజయవాడ, తర్వాత హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులున్నారు. ఆదివారం స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

కొనకళ్లను అభినందించిన యలవర్తి, పొట్లూరి

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: ఆర్టీసీ ఛైర్మన్‌గా నియమితులైన కొనకళ్ల నారాయణరావును గుడివాడ మున్సిపల్ మాజీ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, విశ్వభారతి విద్యా సంస్థల ఛైర్మన్ పొట్లూరి శ్రీమన్నారాయణ శనివారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. గుడివాడ బస్టాండు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఘంటసాల: ఆర్టీసీ ఛైర్మన్‌గా నియమితులైన మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు, తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొనకళ్ల జగన్నాథరావు (బుల్లయ్య)ను ఘంటసాల మండల తెదేపా నాయకులు శనివారం మచిలీపట్నంలో మర్యాద పూర్వకంగా సత్కరించారు.


కొనకళ్ల సోదరులను అభినందిస్తున్న యలవర్తి, శ్రీమన్నారాయణ

వ్యర్థాలతో కళాకృతులు


వ్యర్థలతో చేసిన కళాకృతులను ప్రదర్శిస్తూ..


పోటీల్లో విద్యార్థులు

నాగాయలంక, న్యూస్‌టుడే: విద్యార్థులు తమ అంతర్గత నైపుణ్యాలను వెలికితీయాలని మండల విద్యాశాఖాధికారి టీవీఎం రామదాసు అన్నారు. స్థానిక జడ్పీ పాఠశాలలో శనివారం 6 నుంచి 10 తరగతుల విద్యార్థులకు మండలస్థాయిలో వ్యర్థ పదార్థాల నుంచి విద్యార్థులు తయారు చేసిన పలు కళాకృతులను ప్రదర్శించారు. ప్రదర్శనను పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.ప్రసాద్‌తో కలిసి ఎంఈవో రామదాసు ప్రారంభించారు.

కూచిపూడి, న్యూస్‌టుడే: మొవ్వలోని మండవ కనకయ్య జడ్పీపాఠశాలలో నిర్వహించిన పోటీల్లో మొవ్వ హైస్కూల్, పెదముత్తేవి, నిడుమోలు విద్యార్థులు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. ఎంఈవో 2 శ్రీలక్ష్మి, హెచ్ఎం శ్రీదేవి పాల్గొన్నారు.

శ్రీకాకుళం(ఘంటసాల), న్యూస్‌టుడే: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మండల స్థాయిలో నిర్వహించిన వేస్ట్ టు ఆర్ట్ పోటీల్లో శ్రీకాకుళం జడ్పీ పాఠశాల విద్యార్థులకు ప్రథమ స్థానం లభించిందని ప్రధానోపాధ్యాయిని ఎ.ఎ.భువనేశ్వరి శనివారం తెలిపారు.

కోడూరు (అవనిగడ్డ), న్యూస్‌టుడే: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా శనివారం కోడూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో వేస్టు టు ఆర్టు కార్యక్రమం నిర్వహించారు. మండల స్థాయిలో పలువురు విద్యార్థులు పనికి రాని వస్తువులతో తయారు చేసిన ఆకృతులను ప్రదర్శించారు.

అంతర్జాతీయ పోటీల్లో అశ్వరావుపాలెం విద్యార్థిని

అవనిగడ్డగ్రామీణం, న్యూస్‌టుడే: అంతర్జాతీయ స్థాయిలో ఆన్‌లైన్ విధానంలో శనివారం నిర్వహించిన గజేంద్ర భాగవత పద్యాల పోటీలో పాల్గొని అవనిగడ్డ మండలం అశ్వరావుపాలెం పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న గురువిందపల్లి కీర్తన నైపుణ్యాన్ని ప్రదర్శించింది. పాఠశాల తెలుగు ఉపాధ్యాయిని రమాదేవి, ఉపాధ్యాయులు కోసూరు సముద్రాలు, కవి డాక్టర్ గుడిసేవ విష్ణుప్రసాద్ వద్ద కీర్తన శిక్షణ పొందింది. ఇటీవల ఐబాంబ్ వారు నిర్వహించిన జాతీయ స్థాయి గజేంద్ర భాగవత పద్యాల పోటీల్లో 283 మంది పాల్గొనగా 19 మంది అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులు నగదు బహుమతి పొందినట్లు ఉపాధ్యాయుడు సముద్రాలు చెప్పారు.


కీర్తనతో రమాదేవి, విష్ణుప్రసాద్

2025 మార్చి నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయండి

గుడ్లవల్లేరు, న్యూస్‌టుడే: ప్రస్తుతం పనులు చేపట్టిన లబ్ధిదారులు 2025 మార్చిలోపు ఇంటి నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని, లేకుంటే తర్వాత బిల్లులు మంజూరు కావని మండల హౌసింగ్ ఏఈఈ సురేంద్ర పేర్కొన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం నిర్వహించిన మన ఇల్లు-మన గౌరవం కార్యక్రమంలో లబ్ధిదారులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

పెదపారుపూడి, న్యూస్‌టుడే: పేదలకు ఇచ్చిన లేఔట్లలో ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని వెంట్రప్రగడ సచివాలయం 1, 2 హౌసింగ్ ప్రత్యేకాధికారులు మసిముక్కు శివనాగమణి, స్ఫూర్తి అన్నారు. వెంట్రప్రగడ గ్రామ సచివాలయంలో శనివారం నిర్వహించిన మన ఇల్లు మన గౌరవం గ్రామసభలో వారు మాట్లాడుతూ 2025 అక్టోబర్ నాటికి లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలన్నారు.

లక్ష్మణరావుకు పురస్కారం

గుడ్లవల్లేరు, న్యూస్‌టుడే: భువనేశ్వర్‌లోని ఉత్కళ్ విశ్వవిద్యాలయంలో ఈ నెల 26 నుంచి 28 వరకు నిర్వహించిన ఆప్టికాన్-24 జాతీయ ఫార్మసీ సదస్సులో పాల్గొన్న వీవీ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు ఉత్తమ ఓరల్ ప్రజంటేషన్ బహుమతి అందుకున్నారు. ఇందులో 1300 మంది అధ్యాపకులు పాల్గొనగా ఫార్మస్యూటికల్ ఎనాలసిస్ విభాగంలో లక్ష్మణరావు అధిక రక్తపీడనానికి వినియోగించే నిఫిడివిన్‌ను అంచనా వేసే పద్ధతులపై ఓరల్ ప్రజంటేషన్ అందించి ఏపీటీఐ జాతీయ అధ్యక్షులు మిళింద్ జె ఉమేకర్ తదితరుల నుంచి పురస్కారం అందుకున్నారు.

పెనమలూరు

• పెనమలూరు • గన్నవరం

అధ్వానంగా కంకిపాడు-రొయ్యూరు రహదారి


రోడ్డుపై గుంత

కంకిపాడు-రొయ్యూరు (వయా గొడవర్రు) రహదారి అధ్వానంగా తయారైంది. రెండు మూడడుగుల లోతైన గుంతలు ద్విచక్ర, ఆటో వాహనదారులకు చుక్కలు చూపిస్తున్నాయి. కొన్ని గుంతలను ఆయా గ్రామస్థులు ఆర్‌సీసీ వ్యర్థాలు, బండ రాళ్లతో పూడ్చారు. ఇటీవల కురిసిన వానతో రబ్బీసు, మట్టి కొట్టుకుపోగా రాళ్లు బయట పడ్డాయి. ఇవి ప్రమాదకరంగా మారాయి. గుంతలను క్వారీపొడి, కంకర మిశ్రమంతో నింపితే కొంత ఉపశమనం ఉంటుందని ప్రయాణికులు సూచిస్తున్నారు. – కంకిపాడు, న్యూస్‌టుడే

సార్.. వీధి దీపాలు వెలిగించండి


చీకటిగా బందరు రోడ్డు

కానూరు పరిధిలోని బందరు రోడ్డు అంధకారంగా మారింది. రాత్రి వేళ వీధి దీపాలు వెలగకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెక్ పోస్టు సెంటర్ నుంచి కామయ్యతోపు సెంటర్ వరకు దాదాపు 2 కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఈ ప్రాంతంలో ఎక్కువ రద్దీగా ఉంటుంది. వేలాది వాహనాలు ఈ బందరు రోడ్డుపై రాకపోకలు సాగిస్తుంటాయి. అలాంటి ఈ రోడ్డుపై 5 నెలలుగా వీధి దీపాలు, సెంట్రల్ లైటింగ్ లేక వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చీకట్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. అనేక మంది గాయాలు పాలై ఆసుపత్రుల పాలవుతున్నారు. గతంలో రోడ్డుకు రెండు వైపులా డ్రెయినేజీ పనుల నిమిత్తం కొంత కాలం వీధిదీపాలు వెలగించలేదు. ఇప్పుడు పనులు పూర్తయినా లైట్లు వెలిగించడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ఈ విషయంపై తాడిగడప పురపాలిక కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు స్పందిస్తూ నేషనల్ హైవే అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తామన్నారు. – కానూరు, న్యూస్‌టుడే

సామూహిక సీమంతాలు


కార్యక్రమంలో గర్భిణులు, ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది

పోరంకి, న్యూస్‌టుడే : పోషకాహార మాసోత్సవాల సందర్భంగా గోసాల-3 అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో కె. బేబి సుకన్య మాట్లాడుతూ గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోషకాహారం గురించి అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ కె. శ్రీలత, సర్పంచి సంగెపు శ్రీనివాసరావు, గర్భిణులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్నదాత మోములో సంతోషం

ప్రతి సెంటుకూ పరిహారం ఇచ్చారు



- వై.వి.సత్యనారాయణ, గొడవర్రు

ఏనుగులకోడు కట్టకు గండి పడడంతో 2.80 ఎకరాల్లోని వరి పైరు పూర్తిగా నాశనమైంది. ప్రభుత్వ సాయం రూ.28,660 గురువారం సాయంత్రం బ్యాంకు ఖాతాలో జమైంది. ప్రత్యామ్నాయ పంట వేసుకోడానికి అవకాశం ఏర్పడింది.

5 ఎకరాలకు రూ.50వేలు ఇచ్చారు



- బొమ్మిడి కోటేశ్వరరావు, తెన్నేరు


బుడమేరు ముంపులో మా కుటుంబానికి చెందిన 15 ఎకరాల్లోని వరి పైరు పూర్తిగా పాడైంది. దీనిలో నా వాటాగా 5 ఎకరాలకు రూ.50 అందాయి. మరొకరికి రూ.50 వేలు జమయ్యాయి. మూడో రైతుకు ఇంకా రావాల్సి ఉంది.


కానరనేనివారిపాలెం: నేల మట్టమైన పసుపు తోట తెన్నేరు : కుళ్లిన వరి పైరు

కంకిపాడు, న్యూస్‌టుడే

కృష్ణా నది, బుడమేరు వరదల కారణంగా పంట నష్టపోయిన రైతుల ఖాతాల్లో ప్రభుత్వ సాయం రికార్డు సమయంలో జమైంది. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని సాయం అందుతుందో? లేదో? అనే సందేహాలు తొలగిపోవడంతో బాధిత రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. అయితే ఆధార్‌తో అనుసంధానం, ఈ-పంట నమోదు, సర్వే సమయంలో రైతు అందుబాటులో లేకపోవడం వంటి కొన్ని సాంకేతిక సమస్యలు తదితర కారణాలతో కొందరికి ఇంకా సొమ్ము అందలేదు. దీంతో పంట నష్టపోయిన రైతులు తమకు కూడా పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని ప్రజాప్రతినిధులకు, అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు, సచివాలయ సిబ్బంది లోపాలను సరిదిద్దే ప్రక్రియలో నిమగ్నమయ్యారు.


ఇంత త్వరగా వస్తాయనుకోలేదు



- జుజ్జువరపు జోసెఫ్, తెన్నేరు

ప్రభుత్వ సాయం ఎప్పటిలా ఇంత త్వరగా వస్తుందని అనుకోలేదు. ఐదెకరాల్లోని పంట నష్టానికి రూ.50 వేలు బ్యాంకు ఖాతాలో జమైనట్లు సంక్షిప్త సమాచారం వచ్చింది.

అవసర సమయంలో ఆదుకుంది



- వాకా కోటేశ్వరరావు, కొమటిగుంట

ఒకటిన్నర ఎకరాల్లో మాగాణి పంట బుడమేరు వరదలో దెబ్బతింది. దీనికి రూ.15వేలు ఆర్థిక సాయం అందింది. పొలం బాగు చేసుకుని మరో పైరు వేసుకోడానికి కొంతమేరైనా ఉపయోగపడుతుంది.

మండల స్థాయి ఖోఖో పోటీలు


విజేతలతో వ్యాయామోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది

కంకిపాడు గ్రామీణం, న్యూస్‌టుడే : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంతెన జడ్పీ పాఠశాలలో శనివారం మండల స్థాయి ఖోఖో పోటీలు నిర్వహించారు. అనంతరం అండర్- 14, అండర్- 17, బాలురు, బాలికల విభాగాల్లో శ్రీచైతన్య పాఠశాల పునాదిపాడు, జడ్పీపాఠశాల మంతెన విద్యార్థులు తొలి రెండు స్థానాల్లో నిలిచారు. ఇన్‌ఛార్జి హెచ్ఎం రమణారావు, మండల క్రీడాధికారి ఎం.హరగోపాల్, మంతెన పాఠశాల పీడీ రామలక్ష్మి ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రయత్నం అభినందనీయం

కానూరు, న్యూస్‌టుడే : ఆక్యుపంక్చర్‌కు ప్రత్యేక విభాగ చికిత్సగా గుర్తిస్తూ కేంద్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేయడం ఆనందంగా ఉందని ఆక్యుపంక్చర్ సైన్స్ ప్రాక్టీషనర్స్ ఆపు భారత వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి మాకాల సత్యనారాయణ అన్నారు. శనివారం కానూరు ఇండియన్ ఓం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మందులు వాడకుండా ఎటువంటి సైడ్ ఎఫెక్టులు లేకుండా తక్కువ ఖర్చుతో ప్రజలకు అందుబాటులో తేవటానికి ప్రభుత్వం ప్రయత్నం చేయడం అభినందనీయమన్నారు. ఈ సమయంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా ముందుకొచ్చి ఆక్యుపంక్చర్ కౌన్సిల్ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అలవాలరవి పాల్గొన్నారు.

తిరుమల అక్రమాలపై నిగ్గు తేల్చాలి

కంకిపాడు, న్యూస్‌టుడే : తిరుమలలో గత కొన్నేళ్లుగా జరుగుతున్న అక్రమాలపై వస్తున్న ఆరోపణలపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కంకిపాడులోని శ్రీరమాసహిత సత్యనారాయణస్వామి ఆలయంలో భక్తులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ పదార్థాల వినియోగంతో పాటు శ్రీవాణి టిక్కెట్ల అమ్మకాలు.. ఇలా అన్ని అంశాలపై వాస్తవాలను బయట పెట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తిరుమల పవిత్రతను కాపాడుతామని ప్రతిజ్ఞ చేశారు.


శ్రీరమాసహిత సత్యనారాయణస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

హైడ్రాలిక్ బెడ్ అందజేత



ఉయ్యూరు, న్యూస్‌టుడే : రావ్ అండ్ రావ్ వ్యాపార సంస్థ అధినేత వల్లభనేని నాగభూషణ రావు(భూషయ్య) తన తల్లి సత్యనాగ భానుమణి జ్ఞాపకార్థం ఉయ్యూరు ప్రభుత్వాసుపత్రికి హైడ్రాలిక్ బెడ్‌ను సూపరింటెండెంట్ డాక్టర్ మురళికి శనివారం అందజేశారు. కార్యక్రమంలో వైద్యశాల మాజీ ఛైర్మన్ మండల జయదేవ్, తెదేపా నాయకుడు ఈడే అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యూరు ఆర్డీవోగా షారోన్

ఉయ్యూరుగ్రామీణం, న్యూస్‌టుడే : ఉయ్యూరు ఆర్డీవోగా బీఎస్ హెచ్ షారోన్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన సబ్‌కలెక్టర్ బదిలీల్లో రేపల్లె నుంచి ఉయ్యూరు బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించడానికి వచ్చిన షారోన్‌కు ఏఓ బద్రునాయక్, ఉద్యోగులు స్వాగతం పలికారు. ఇక్కడ ఆర్డీవోగా ఉన్న డి.రాజు నరసాపురం బదిలీ పై వెళ్లారు.


సిబ్బందితో మాట్లాడుతున్న షారోన్

మత్తు పదార్థాలకు అలవడితే జీవితం చిత్తే

కంకిపాడు గ్రామీణం, న్యూస్ టుడే : విద్యార్థి దశలో మత్తు పదార్థాలకు అలవాటుపడితే వారి జీవితం చిత్తు అవుతుందని కంకిపాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మురళీకృష్ణ, ఎస్సై సందీప్ అన్నారు. శనివారం గొడవర్రు జడ్పీ పాఠశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. మత్తు పదార్థాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకున్న పలువురిని ఉదాహరణగా చూపారు. తల్లిదండ్రులు నిత్యం వారి పిల్లలను గమనించాలన్నారు. అనంతరం ట్రాఫిక్ నియమాలు, పోక్సో, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయుడు సుబ్రహ్మణ్యం, ఎస్ఎంసీ ఛైర్మన్ రాము తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాలతో అవస్థలు


ప్రసాదంపాడు అయోధ్య సూర్యనారాయణ వీధిలోని ఖాళీ స్థలాల్లో ఇదీ పరిస్థితి...

విజయవాడ రూరల్ మండలంలోని రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు గ్రామాల్లో ఖాళీ స్థలాల నిర్వహణను యజమానులు పట్టించుకోవడం లేదు. భూములు కొనుగోలు చేసిన యజమానులు వాటి నిర్వహణ వదిలేయడంతో ఆయా ఖాళీ స్థలాల్లో చెట్లు, పిచ్చి మొక్కలు పెరిగి పరిసర ప్రాంతాల్లో నివసించే ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలిగిస్తోంది. పంచాయతీ అధికారులు సైతం శ్రద్ధ పెట్టకపోవడంతో వీటిల్లో పిచ్చి మొక్కలు, ముళ్ల కంపలు పెరిగి అపరిశుభ్రతకు నిలయాలుగా మారాయి. కొన్ని స్థలాలు రోడ్డు కంటే పల్లంలో ఉండడంతో వర్షపు నీరు వెళ్లే మార్గం లేక చెరువులను తలపిస్తోన్నాయి. దీంతో దోమలకు ఆవాస కేంద్రాలుగా మారాయి. దీంతో పరిసర ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటువంటి అపరిశుభ్ర వాతావరణం వల్లే విషజ్వరాలు ప్రబలుతున్నాయని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్థల యజమానులకు నోటీసులు అందజేసి ఖాళీ స్థలాలు శుభ్రం చేయించాలని స్థానికులు కోరుతున్నారు.
- ప్రసాదంపాడు, నిడమానూరు, న్యూస్‌టుడే

కంకిపాడులో నీటి సమస్యకు చెక్

కంకిపాడు గ్రామీణం, న్యూస్‌టుడే : కంకిపాడులో తాగునీటి సమస్యకు పరిష్కారం లభించింది. కేంద్ర ప్రభుత్వ జల్‌జీవన్ పథకంలో భాగంగా గ్రామానికి మంజూరైన సుమారు రూ.2.36 కోట్ల నిధులతో అవసరమైన చోట తాగునీటి పైపులు, 2 లక్షల లీటర్ల సామర్థ్యంతో నిర్మించిన తాగునీటి ట్యాంక్‌ను శనివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే బోడే ప్రసాద్, ఎంపీపీ రాజ్యలక్ష్మి, సర్పంచి రమణ, ఎంపీడీవో అనూష, తహసీల్దారు భావన్నారాయణ, గ్రామ కార్యదర్శి రామకృష్ణ, తెదేపా మండల అధ్యక్షుడు రవీంద్ర, గ్రామ కమిటీ అధ్యక్షుడు సీహెచ్.రాజా, టి.హరికృష్ణ, బండి నాంచారయ్య, పులి శ్రీను, విక్రం, వెంకట్, జయ, శివపార్వతి, బాజీ, జి.రమణ పాల్గొన్నారు.

బాపులపాడు ఈవోపీఆర్డీగా లక్ష్మయ్య

హనుమాన్ జంక్షన్: బాపులపాడు మండల ఈవోపీఆర్డీగా కె.లక్ష్మయ్య నియమితులయ్యారు. ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడు నుంచి ఆయన బదిలీపై ఇక్కడకు రానున్నారు. ఈ మేరకు శనివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రస్తుత ఈవోపీఆర్డీ విజయలక్ష్మి ఏలూరు జిల్లా చాట్రాయికు బదిలీ అయ్యారు.

రాత్రికి రాత్రి రంగా విగ్రహం ఏర్పాటు

గతంలో గౌతు లచ్చన్న విగ్రహ నిర్మాణానికి అనుమతి


రంగా విగ్రహం ఇదే

పెనమలూరు, న్యూస్‌టుడే : గౌతు లచ్చన్న విగ్రహ ఏర్పాటుకు అనుమతి పొందిన స్థలంలో రాత్రికి రాత్రి వంగవీటి మోహనరంగా విగ్రహం ఏర్పాటు చేసిన ఘటన తాడిగడప మున్సిపాలిటీ పరిధిలోని యనమలకుదురు శివపార్వతి నగర్‌లో చోటుచేసుకుంది. స్థానికంగా కొంత ప్రభుత్వ స్థలాన్ని గతంలో ఓ వైకాపా నాయకుడు ఆక్రమించడంతో మున్సిపల్ అధికారులు ఖాళీ చేయించారు. అనంతరం ఆ స్థలంలో గౌతు లచ్చన్న విగ్రహం ఏర్పాటు చేసేందుకు గౌతు లచ్చన్న సేవాసమితి ప్రతినిధులు మున్సిపాలిటీ నుంచి అనుమతి పొందారు. విగ్రహ తయారీకి ఆర్డర్ ఇచ్చిన సేవాసమితి ప్రతినిధులు.. లచ్చన్న జయంతి నాడు ఎమ్మెల్యే బోడే ప్రసాద్‌తో శంకుస్థాపన చేయించారు. ఇదిలాఉండగా శుక్రవారం రాత్రి గుట్టుచప్పుడు కాకుండా కొందరు వంగవీటి మోహనరంగా విగ్రహం ఏర్పాటు చేయడంతో స్థానికులతో పాటు గౌతు లచ్చన్న సేవాసమితి ప్రతినిధులు కంగుతిన్నారు. వారు పెనమలూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా నలుగురు యువకులను అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మార్చి నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బోడే ప్రసాద్ , వేదికపై కమిషనర్ భవానీ ప్రసాద్, ఎంపీడీవో సునీతా శర్మ తదితరులు

పోరంకి, న్యూస్‌టుడే : కేంద్ర ప్రభుత్వ నిధులు రద్దు కాకుండా ఉండాలంటే మార్చి నాటికి లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం పెనమలూరు మండలం వణుకూరులో మన ఇల్లు మన గౌరవం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీడీవో సునీత శర్మ, వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ భవానీ ప్రసాద్, హౌసింగ్ ఏఈ అబ్దుల్ జిలానీ, మారుపూడి ధనకోటేశ్వరరావు, అనుమోలు ప్రభాకరరావు, కోయ ఆనంద్, సూదిమల రవీంద్ర, శ్రీనివాసరావు, వల్లె నరసింహారావు, రమేష్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కంకిపాడు, హనుమాన్ జంక్షన్, న్యూస్‌టుడే : జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని లబ్ధిదారులు డిమాండ్ చేశారు. కంకిపాడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం 'మన ఇల్లు - మన గౌరవం' పేరుతో సమావేశం నిర్వహించారు. కంకిపాడు గ్రామానికి చెందిన సుమారు వెయ్యి మంది లబ్ధిదారులకు గొడవర్రు, ఈడుపుగల్లు గ్రామాల్లో స్థలాలు కేటాయించారు. ప్రధాన, అంతర్గత రహదారులు వంటి కనీస సౌకర్యాలు లేకపోవడంతో ఇళ్లు కట్టుకోలేకపోతున్నామని లబ్ధిదారులు తెలిపారు. నిర్మాణాలు చేపట్టని వారి పట్టాలు రద్దు చేస్తామని బెదిరిస్తున్నారన్నారు. ఎంపీపీ రాజ్యలక్ష్మి, ఎంపీడీవో అనూష, గృహ నిర్మాణశాఖ అధికారులు పాల్గొన్నారు.

☞ బాపులపాడులో మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యాయలంలో లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. 2025 మార్చి నాటికి ఇళ్లన్నీ పూర్తి చేసేలా కార్యాచరణ చేపట్టాలని కోరారు. సర్పంచి కమలా బాయి ఉప సర్పంచి దుట్టా శివన్నారాయణ, ఈవో సీహెచ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వణుకూరులో స్వచ్ఛతా హీ సేవా

పోరంకి, న్యూస్‌టుడే : నెహ్రూ యువ కేంద్రం, ఎన్ఎస్ఎస్ యూనిట్ ధనేకుల ఇంజినీరింగ్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం వణుకూరులో నిర్వహించారు. హైస్కూల్ విద్యార్థులకు ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణపై అవగాహన కల్పించారు. అనంతరం పరిసరాలలో ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త తొలగించారు. సర్పంచి విజయ, కళాశాల ప్రిన్సిపల్ కడియాల రవి, ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారి వెంకటేశ్వరరావు, విద్యార్థులు, యువత పాల్గొన్నారు.

ప్రభుత్వ పరిశీలనలో భూముల ధర తగ్గింపు

హనుమాన్ జంక్షన్, న్యూస్‌టుడే : మల్లవల్లి పారిశ్రామికవాడలో భూముల ధర తగ్గింపుపై ప్రభుత్వం ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, ఈ అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తుందని ఏపీఐఐసీ జెడ్ఎం కె.బాబ్జీ తెలిపారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఆయన శనివారం బాపులపాడు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. పారిశ్రామికవాడ భూములకు సంబంధించి భూ వ్యవహారాలు, రికార్డుల గురించి అవగాహన ఏర్పర్చుకునేందుకు ఇక్కడకు వచ్చానని తెలిపారు. ఇప్పటికే రెవెన్యూ అధికారులు పారిశ్రామికవాడ భూములకు సరిహద్దులు నిర్ణయించారని, దీంతో దీర్ఘకాలంగా ఉన్న సమస్యకు పరిష్కారం లభించిందని పేర్కొన్నారు. తహసీల్దార్ నాగభూషణం వివిధ అంశాలను జెడ్ఎంకు వివరించారు.

ఘనంగా భగత్‌సింగ్ జయంతి

ఉయ్యూరు: స్థానిక ఏజీఎస్‌జీఎస్ కళాశాలలో స్వాతంత్ర్యయోధుడు భగత్‌సింగ్ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి ప్రిన్సిపల్ డాక్టర్ శివనాథ్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చరిత్ర శాఖాధిపతి టి.నరసింహారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆటల పోటీలకు ఎంపిక

గన్నవరం గ్రామీణం: గన్నవరం బాలుర జడ్పీ క్రీడా మైదానంలో నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ క్రీడా జట్లను శనివారం ఎంపిక చేశారు. వాలీబాల్, ఖోఖో, ఇతర క్రీడా జట్లను మండలాల్లోని విజేతల ఆధారంగా ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో రవి కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

దసరాకు ప్రత్యేక ఏర్పాట్లు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే : పాత గన్నవరంలో కొలువైన శ్రీలక్ష్మి తిరుపతమ్మ ఆలయంలో దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు చేయనున్నట్లు కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్ తెలిపారు. స్థానిక ఆలయంలో అక్టోబర్ 3 నుంచి 12 వరకు జరిగే శరన్నవరాత్రుల ఆహ్వాన ప్రతులను శనివారం ఆవిష్కరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

డాబాపై నుంచి కిందపడి తాపీ కూలీ మృతి

కంకిపాడు గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలోని ఈడుపుగల్లు చెరువు పక్కన నిర్మాణంలో ఉన్న ఓ డాబాపై నుంచి కిందపడిన తాపీకూలీ తీవ్రగాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన విషాద ఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామంలోని చెరువు సమీపంలో ఓ భవనం నిర్మాణ పనులకు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన బాలక్రిష్ణగోండ్ (40) వచ్చారు. ఆయన భవనం మొదటి అంతస్తులో పరంజాలు వేసే క్రమంలో జారి కింద పడ్డారు. క్షతగాత్రుడిని ఓ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందారు. మృతుడి భార్య సీతాగోండ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కంకిపాడు పోలీసులు కేసు నమోదు చేశారు.

చోరీ కేసుల్లో మైనర్ల అరెస్టు

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు బాల నేరస్థులను వీరవల్లి పోలీసులు అరెస్టు చేశారు. ఈ నెల 26న ఉమామహేశ్వరపురానికి చెందిన వీఆర్వో ఆర్నేపల్లి చైతన్యకుమార్ తన ఇంటి ముందు నిలిపిన ద్విచక్రవాహనం కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి, దర్యాప్తు జరిపిన ఎస్సై శ్రీనివాస్ ఇద్దరు బాలురు ఈ చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. వారిద్దర్ని శనివారం అదుపులోకి తీసుకుని, వారి వద్ద ఉన్న రెండు ద్విచక్రవాహనాలు, ఒక చరవాణి స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్ని విజయవాడ కోర్టులో హాజరుపర్చగా బాలనేరస్థుల గృహానికి తరలిస్తూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు.

మద్యం అక్రమంగా విక్రయిస్తున్న ఇద్దరి..

కంకిపాడు గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలోని తెన్నేరులో మద్యం అక్రమంగా విక్రయిస్తున్నారనే సమాచారంతో శనివారం కంకిపాడు ఎస్సై సందీప్ సిబ్బందితో మెరుపుదాడి నిర్వహించారు. ఉంగుటూరు మండలం నందమూరు గ్రామానికి చెందిన పెనుమత్స మహేష్, పేటేటి వంశీ అనే ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. వారి నుంచి 100మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇద్దరు ఉపాధ్యాయులకు నోటీసులు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: గన్నవరం బాలుర జడ్పీ పాఠశాల ఆవరణలోని బాలికల జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులకు డీఈవో తాహెరా సుల్తానా షోకాజ్ నోటీసులు జారీ చేశారు. పాఠాలు బోధించాలన్న తరగతులను విస్మయించి హెచ్ఎం రవీంద్రభవానీ ఆదేశాలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు ఇటీవల విచారణ కమిటీ ఉన్నతాధికారులకు నివేదించింది. దీంతో పీజీటీలు పి.శ్రీనివాస్, కె.దాని సుధాకర్‌లకు షోకాజ్ నోటీసులను అందించారు.

మృతుడు అసోం యువకుడు

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: పెడన-విస్సన్నపేట జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన ప్రమాదంలో దుర్మరణం చెందిన యువకుడు అసోంకు చెందిన రాజకుమార్(30)గా పోలీసులు గుర్తించారు. కానుమోలు-ఆరుగొలను గ్రామాల సరిహద్దులో ఇతడు నడిచి వెళుతుండగా, గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఇతడు ఆరుగొలనులోని కోఫుడ్స్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడని, మృతదేహాన్ని గన్నవరం శవాగారంలో ఉంచి, బంధువులకు సమాచారం ఇచ్చినట్లు ఎస్సై జనార్ధన్ తెలిపారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: ఇంట్లో దాచుకున్న రూ.66 వేల నగదుతో భర్త అదృశ్యమైన ఘటనపై బాపులపాడు మండలం మల్లవల్లికు చెందిన షేక్ షాహీనా వీరవల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో, ఎస్సై శ్రీనివాస్ కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం 32 ఏళ్ల కాసీంవలీ ద్విచక్ర వాహనంపై గ్రామాలు తిరుగుతూ ప్లాస్టిక్ వస్తువులు అమ్ముతూ ఉంటాడు. ఈ నెల 11న ఎప్పటిలాగే ఇంటి నుంచి వెళ్లిన అతడు తిరిగి రాలేదు. చరవాణి కూడా పనిచేయకపోవడం, ఇంట్లో ఉన్న డబ్బు కూడా కనిపించకపోవడంతో కొన్ని రోజుల తర్వాత తిరిగి వస్తాడని ఎదురుచూసింది. వారాలు గడిచినా భర్త ఆచూకీ లేకపోవడంతో శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు ఇవ్వడంతో, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

EENADU Classifieds

AUTO

VEHICLES FOR SALE

2014 Fortuner white colour, Top end, Automatic, All advance features for sale. Only direct parties. Contact ✆ 89858 87459.

2019 టాటా మోడల్ ఎక్స్‌ప్రెస్ బస్సు ★ 2020 అశోక్ లేలాండ్ స్లీపర్ (వెన్నెల) బ్యాంక్ వారి వేలం ద్వారా అమ్మబడును. వివరములకు ✆ 90301 61117.

BUSINESS SERVICES

WANTED DEALERS/AGENTS

Wanted Dealers and Distributors for Alkaline Water Bottle Company in Vijayawada. Cont: 89779 24233, 94404 14646.

Wanted CSA, SS, Chennai base Edible Oil, Basmati Rice Products. Srikrishna Foods. Ph: 8919478977.

BUSINESS OFFER

Looking for Investment Partner in IT Service/ Education / Online Stores Who Can Invest Mini 25 Lakhs. ✆ 73827 90366.

కొబ్బరి పీచు / కోకోపిట్ పూర్తి రన్నింగ్ కండిషన్‌లో గల ఫ్యాక్టరీ అమ్మకంనకు or అద్దెకు కలదు. మేదరమెట్ల, బాపట్ల జిల్లా. వివరములకు సంప్ర॥ 98495 19527.

మహిళలు, నిరుద్యోగులు, చిన్న పెట్టుబడితో హోమ్ బేస్డ్ ప్రోడక్ట్ బిజినెస్ ద్వారా ప్రతినెల ఫిక్స్‌డ్ సంపాదన పొందండి. ✆ 7013544075, 7842877904.

PACKERS & MOVERS

Tirumala Packers & Movers an ISO 9001: 2015 Certified Co. House hold Goods shifting any time any where. ✆ 97043 64389, 92900 87673.

SOLAR PRODUCTS

Surya Ghar పథకము ద్వారా సబ్సిడీ, తక్కువ ధరలో బ్యాంక్ లోన్ సౌకర్యంతో నాణ్యమైన Solar Project చేయబడును. వివరాలకు సంప్ర: 81792 39699.

BUILDING CONSTRUCTION

Raghava Constructions. We do Building Contracts on Turn Key Basis for VMC/ APCRDA Approvals, Vasthu, Plans Elevations & Structural Designs. ✆ 98851 12999.

తక్కువ ఖర్చు, పూర్తి క్వాలిటీతో మీ ఇల్లు మరియు ఇతర ఏ కట్టడమైనా కాంట్రాక్ట్ పద్ధతిలో కట్టబడును. లోన్ సౌకర్యం కలదు. సంప్ర॥ PVR Constructions. ✆ 77805 69091.

సూర్య కన్‌స్ట్రక్షన్స్: ఇండ్లు, అపార్ట్‌మెంట్స్, మెటీరియల్ కాంట్రాక్ట్ మరియు డెవలప్‌మెంట్ చేయుటకు సంప్రదించండి. ✆ 94402 42092.

WATER PROOFING

Tarun Slab Leakage Works ★ 25 Yrs. Exp. ★ 5 Yrs. Warranty ★ Bathroom Leakage Grouting Epoxy Works. ★ 94940 02285, 99516 07504.

WOOD

377 టేకుచెట్లు 3 అడుగుల నుండి 5 అడుగుల చుట్టు కొలత గల నాణ్యమైన టేకు చెట్లు అమ్మకమునకు కలవు. నూజివీడు Contact. ✆ 98484 70700.

BEAUTY & PERSONAL CARE

వీనస్ బ్యూటీ ట్రైనింగ్ ఇని స్టిట్యూట్. కుసుమ ఈ TV 2 సఖీ & వసుంధర ఫేమ్ బేసిక్, అడ్వాన్స్, అరోమాథెరపీ & మేకప్‌లతో పూర్తి డిప్లొమా కోర్సు. గాయత్రి నగర్, 1st లైన్, సం॥ 98485 88530.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

EDUCATION

Last Date: SSC, Inter One Sitting.. MBBS, BPT, MLT, GNM, many Diploma Courses. Hindi Pradhamika to Praveena.. Wisdom Academy. ✆ 70957 91736.

రెగ్యులర్ & డిస్టెన్స్ అడ్మిషన్స్: డిగ్రీ, PG, B.Tech, డిప్లొమా, D&B-ఫార్మసీ, D.Ed, B.Ed, B.P.Ed, MBA, MCA, B.Sc(Agri), B.Sc (నర్సింగ్), GNM. Ph:8866977112, 339

SPOKEN HINDI

Learn Online / Offline Spoken Hindi/ English & French With in 30 Days 100% Guarantee for all ages. Free Demo. ✆ 98495 42456.

HOME TUITIONS

KKRs Maths Tuition: Regular & IIT Classes for State & CBSE (8,9,10,+1,+2), Diploma, Inter (MPC), B.Tech (Maths) and GRE (Maths) at Gunadala. ✆ 98858 83128.

ప్రత్యూష (ఆన్‌లైన్ & హోమ్) ట్యూషన్స్ LKG to PG, NEET, IIT, EAMCET, B.Tech. CA-CPT, BITSAT ఆల్ ట్యూటర్స్ కావాలన్నా ✆ 92900 05677, 74165 35749.

FINANCIAL SERVICES

ఖాళీ స్థలాలపై లోన్స్ / హోమ్ లోన్స్ / ప్రోపర్టీ లోన్స్ / బిజినెస్ లోన్స్ చేయబడును. సిబిల్ అవసరం లేదు. సంప్ర: ✆ 94909 63409.

తాడికొండ పెదపరిమి పొలంపై లోన్ (Finance) కావలెను. Contact Only Financiers.Cell: 9550579985.

మీ ఇళ్లు, బిల్డింగ్స్, కాంప్లెక్స్‌ల మీద తనఖా పద్ధతిలో రూ. 1 వడ్డీకి ఫైనాన్స్ ఇప్పించబడును. వేరే ఏ బ్యాంకులో వున్ననూ విడిపించబడును. ✆ 83099 11995, 93904 35013.

బ్యాంకింగ్, నాన్ బ్యాంకింగ్.. All type లోన్స్ - హోమ్ లోన్, మార్ట్‌గేజ్, ఎడ్యుకేషనల్ లోన్, టేకోవర్ మరియు Top అప్.. లో సిబిల్, నో ITR.. ✆ 77025 49105.

FOOD

విజయవాడ పాత ఆటోనగర్ సరౌండింగ్ 5KM పరిధిలో హాస్టల్స్‌కి, కాలేజీలకి, వర్కర్స్‌కి మంచి క్వాలిటీ టిఫిన్స్ & భోజనం సప్లయ్ చేయబడును. సంప్ర: ✆ 85292 93979.

HOME NEEDS

PEST CONTROL

Tarun Pest ★25 Yrs. Exp. 5 Yrs. Waranty ★ Smell Less ★ Bayers Chemicals (Pest and Other Insects Control). ✆ 94940 02285, 99516 07504.

Priyanka Pest: 25 Yrs. Exp. 5 Yrs. Warranty Smell Less Bayer Chemicals (Pest and Other Insects Control). ✆ 94924 82494, 93932 30136.

బాలాజీ పెస్ట్ కంట్రోల్ Bayer కెమికల్స్‌తో చెదలు నివారణ 6 సం॥లు వారంటీ. మీ విలువైన వస్తువులకు ఇళ్ళు, ఆఫీసులు, అపార్ట్‌మెంట్స్‌కు చెదలు నివారణ చేయబడును. ✆ 91103 43262, 89853 51383.

INDUSTRY

MACHINERY FOR SALE

GEN Samrat హార్వెస్టింగ్ మెషీన్లు, హైడ్రాలిక్, పంపులు, గేర్ బాక్సులు, మోటార్లు, వరికోత మెషీన్లు, విడి భాగాలు. కియరెన్సు సేల్ 50% Dis. Ph:9246249543, 9000688888

PEOPLE CARE

OLD AGE HOME

నెస్ట్ కేర్ హోమ్ వృద్ధాశ్రమము కానూరు, విజయవాడ సంప్రదించండి ✆ 98483 40496, 73866 20496.

వృద్ధాశ్రమం
శ్రీ వేంకటాద్రి
వయోవృద్ధుల ఆశ్రమం, వెంగలేరు గ్రామం జి.కొండూరు మండలంలో చేరదలచినవారు సంప్రదించండి.
✆ 9848691799

పున్నయ్య గారి ఓల్డ్ ఏజ్ హోమ్. వృద్ధులను, బెడ్ పేషంట్లను చేర్చుకొనబడును. ఇంటి వాతావరణంతో కూడిన వృద్ధాశ్రమం. Ph: 94941 79779 / 63027 93978.

REAL ESTATE

